# ఆర్గాన్ న్యూస్

VOICE OF DEMOCRACY

తెలుగు దినపత్రిక

సంపుటి : 18 సంచిక : 113 ఖమ్మం, తెలంగాణ బుధవారం 13.05.2026 పేజీలు : 12, వెల : 2/-

Circulating to : Hyderabad, Khammam, Warangal, Nalgonda, Karimnagar, Adilabad, Medak and Mahabubnagar




## హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

### 14న విచారించనున్న వెకేషన్ బెంచ్

హైదరాబాద్,మే12 : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్

-మిగతా 2 లో..

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

**సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు**

ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే

అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ

లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి

కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు



**ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.**

హైదరాబాద్, మే 12 : ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు

-మిగతా 2 లో..

40 వసంతాల తుమ్మల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు దాటిన ఆ రాజకీయ యోధునితో కలిసి ఆర్గాన్ కూడా ప్రయాణం చేసిందని ప్రజలకు గుర్తు చేసేందుకే మా ఈ ప్రయత్నం..


# "బయ్యారం భూకంపం"

## ఆర్గాన్ అక్షరాయుధం

- తుమ్మల గర్జనతో కూలిన ఖనిజ సామ్రాజ్యం
- ఉమ్మడి రాష్ట్రాన్ని కుదిపేసిన బయ్యారం ఇనుప ఖనిజ కుంభకోణం
- అసెంబ్లీలో ఆర్గాన్ కథనాలను ఆయుధంగా మలిచిన తుమ్మల నాగేశ్వరరావు
- వేల కోట్ల ప్రజా సంపద దోపిడీపై రోశయ్య సర్కార్ విచారణకు ఆదేశాలు
- మీడియా--ప్రజానాయకత్వం కలిస్తే చరిత్ర మారుతుందనే అరుదైన ఉదాహరణ
- ఆర్గాన్ ఎడిటర్ రవికుమార్ దండ్యాల ప్రత్యేక కథనం

ఆయనతో నేను ఎన్నడూ ఫోటో దిగలేదు... సెల్ఫీ తీసుకోలేదు... ఎదురెదురుగా కూర్చొని మాట్లాడలేదు... కనీసం షేక్‌హ్యాండ్ కూడా ఇవ్వలేదు... అయినా మా మధ్య ఉన్న అనుబంధం రెండు రాష్ట్రాల గమనాన్నే మార్చింది..." --- ఈ భావోద్వేగ వాక్యాల వెనుక ఒక పత్రిక ధైర్యం, ఒక ప్రజానాయకుడి రాజకీయ పోరాటం, ఒక రాష్ట్రాన్ని కుదిపేసిన ఖనిజ కుంభకోణం, ప్రజాసంపద కోసం సాగిన యుద్ధ చరిత్ర దాగి ఉంది. 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను వణికించిన "బయ్యారం ఇనుప ఖనిజ కుంభకోణం" వెనుక నిలిచింది ఒక ప్రాంతీయ పత్రిక చేసిన వరుస సంచలన కథనాలు... వాటిని అసెంబ్లీలో అక్షరాయుధాలుగా మలిచిన అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు ధీటైన పోరాటం... చివరకు ప్రభుత్వం తీసుకున్న సంచలన నిర్ణయం.

- ప్రత్యేక కథనం 6, 7 పేజీల్లో





# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడుత పంపిణీ

**రెండో విడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం**

స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ

అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు.**

హైదరాబాద్, మే 12 : ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

-మిగతా 2 లో..

# బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు

**తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా**


ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్




హైదరాబాద్, మే 12 : స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు.

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 170 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 197 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 305 (కిలో) |
| స్కిన్ లెస్ | 345 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

# పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

**చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది**

పొన్నం వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్న టీపీసీసీ చీఫ్



హైదరాబాద్, మే 12 : తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. కాంగ్రెస్

-మిగతా 2 లో..




# ఏపీ, తెలంగాణ అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలి

**కృష్ణా నదీ యాజమాన్య బోర్డు**

హైదరాబాద్: ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్‌లో జరిగిన కేఆర్ఎంబీ

-మిగతా 2 లో..

# నా కుమారుడిని నేను సమర్థించడం లేదు

తను తప్పూ చేయలేదని చెబుతున్నాడు

చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా.

కుమారుడిపై పోక్సో కేసు..

స్పందించిన కేంద్రమంత్రి బండి సంజయ్



కరీంనగర్: తన కుమారుడు బండి భగీరథ్‌ను నేరస్థుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. బండి

-మిగతా 2 లో..ఐ




# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

- పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టిఎ నిర్ణయం
- సిబిఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి
- 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ, మే12 :** జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ–2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

### 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

రాజస్థాన్‌లోని సికార్‌లో నీట్ పేపర్ లీక్ కేసు వ్యవహారంలో 13 మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. 'గెస్ పేపర్' పేరుతో మార్కెట్‌లోకి ఈ నీట్ ప్రశ్నాపత్రం వచ్చింది. ప్రభుత్వం నిర్వహించిన ప్రశ్నాపత్రంతో ఈ 'గెస్ పేపర్' 100 శాతం సరి పోలినట్లు అధికారులు గుర్తించారు. అలాగే మే 3వ తేదీన ఈ నీట్ పరీక్ష నిర్వహించగా.. అంతకు ముందే ఈ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ప్రశ్నాపత్రం రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు గుర్తించారు. కేరళలోని ఒక ఎంబీబీఎస్ విద్యార్థి వద్ద ఈ పేపర్ లీక్ అయినట్లు పోలీసులు కనుగొన్నారు. మే 1వ తేదీన సికార్‌లోని స్నేహితుడితో ఎంబీబీఎస్ విద్యార్థి ఈ ప్రశ్నాపత్రం పంచుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత కోచింగ్ సెంటర్లు, అభ్యర్థులకు ఈ పేపర్ లీక్ అయినట్లు సమాచారం.నైల్ పరీక్షల్లో అసలు ప్రశ్నాపత్రంలోని 140 ప్రశ్నలు సరి పోలాయి. ఈ 140 ప్రశ్నలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరలయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరీక్ష నిర్వహించే తేదీలు త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.




## 'ఏపీ, తెలంగాణ అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలి'

(మొదటిపేజీ తరువాయి)

త్రిసభ్య కమిటీ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతించింది. తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీల వినియోగానికి అంగీకారం తెలిపింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలంగాణ అధికారులు కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లారు.

# పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులసంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు. పొన్నం సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పుకొచ్చారు. పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం..? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు

(మొదటిపేజీ తరువాయి)

ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు. మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జె÷న్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు



గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామిలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా




అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడుత పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)




చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలో మీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించా లన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశిరచారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్ సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని, స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖ–రరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్?పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



# హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

(మొదటిపేజీ తరువాయి)

విచారణ జరిపే అవకాశం ఉంది.అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.

# నా కుమారుడిని నేను సమర్థించడం లేదు

(మొదటిపేజీ తరువాయి)

భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో సంజయ్ స్పందించారు. "ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. నా కుమారుడిపై దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది.. డిప్రెషన్‌లోకి పోతోంది. నేను బాధపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారు. నేనెప్పుడూ బాధపడను. కుట్రలు, కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టను" అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# కామారెడ్డిలో రైల్‌రోకో కేసు

- కవితకు రైల్వే కోర్టు సమన్లు
- నేడు సికింద్రాబాద్ కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

**హైదరాబాద్, మే 12 :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల డిమాండ్ చేస్తూ నిర్వహించిన రైల్ రోకో కార్యక్రమం కేసులో తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ అయ్యాయి. బుధవారం విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొంతకాలం క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే రవాణాకు అంతరాయం కలిగిందని రైల్వే ఏఎస్ఐ రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. రైల్ రోకోతో నిజామాబాద్–హైదరాబాద్ రూట్‌లో అంతరాయం ఏర్పడింది. నేటి ఉదయం 10:30కి విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశించింది. దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు గూడ్స్ రైలు నిలిపివేతపై రైల్వే యాక్ట్ సెక్షన్ల కింద కవితపై న్యాయస్థానం కేసు నమోదు చేసింది. ఈ కేసులో కవితతో పాటు మరో 12 మంది బీఆర్ఎస్ నాయకులపై కూడా కేసులు నమోదయ్యాయి. రైల్వేచట్టాల ఉల్లంఘన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా నేడు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు కవిత, బీఆర్ఎస్ నేతలు హాజరవుతారా లేదా అనేది ఉత్కంఠగా మారింది. బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది.

# నేషనల్ డెయిరీతో నార్ముల్ ఒప్పందం

## పాడిరైతులకు తొలుత పదికోట్లు చెల్లింపు

**హైదరాబాద్, మే 12 :** నల్లగొండ–రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్ముల్), నేషనల్ డెయిరీ డెవలంప్‌మెంట్ బోర్డుతో త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. 15 ఏళ్లపాటు డెయిరీ అభివృద్ధి చేసే బాధ్యతను అది తీసుకోనుంది. ఒప్పందంలో భాగంగా మొదట పాడి రైతుల బకాయిలను చెల్లించేందుకు రూ.10 కోట్ల రూపాయలను చెల్లించనుంది. ఈ మేరకు ఎన్‌డిబిబి అధికారులతో తెలంగాణ రాష్ట్ర డెయిరీ విభాగం అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

# నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

- వారి సేవలు చిరస్మరణీయం
- వారిది ఉదయోగం కాదు.. నిరంతర సేవ
- 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందచేత
- వారి సేవలు నిరుపమానమని అన్న మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, మే 12 :** ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేశారు. కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మిర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీపీహెచ్ రవింద్ర నాయక్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నర్సులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నర్సులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈరోజు మీకు జీవితాంతం గుర్తిండిపోతుంది. నర్సింగ్ అనేది కేవలం ఒక వృత్తి కాదు.. మానవత్వానికి చేసే గొప్ప అవకాశం. రోగులకు చికిత్స అందించడమే కాదు.. వారికి ధైర్యం, భరోసా, ఆశను కల్పించేది నర్సులే. ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి. పరిశుభ్రత, క్రమశిక్షణ, శాస్త్రీయ వైద్య సేవల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు ఆమె. మీరు అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి. కోవిడ్‌లో కుటుంబ సభ్యులు కూడా పేషెంట్ల దగ్గర ఉండలేని పరిస్థితి, అటువంటి భయంకర మైన పరిస్థితుల్లో కూడా నర్సులు సేవలు అందించారు. తెలంగాణ ప్రజలు ఆ సేవలను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. గతంలో ప్రభుత్వ హాస్పిటళ్లలో భారీగా ఖాళీలు ఉండటం వల్ల వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి ఉండేది. ఈ సమస్యను మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని భారీ స్థాయిలో నియామకాలు చేపట్టింది. గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేశాం. ఇదే గ్రౌండ్‌లో ఇప్పటికే 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలు అందజేశాం. ఇక్కడే 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు నియామక పత్రాలు అందించాం. ఇక్కడే 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు నియామక పత్రాలు అందించాం. ఈరోజు ఇక్కడే 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందిస్తున్నాం అని మంత్రి వివరించారు. గతంలో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేశాం. రెండున్నర సంవత్సరాల్లో 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుంది. దాదాపు మరో 5 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలు మరో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తాం. న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తాం అని మంత్రి దామోదర వెల్లడించారు.



## బీఆర్ఎస్ ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ

**పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రధానంగా దృష్టి**

**గజ్వేల్, మే 12 :** బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఆరు గంటలుగా కొనసాగింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉపనాయకులు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్లు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల రద్దుపైనా సుదీర్ఘ చర్చ కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఎన్నుకోవాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా నేతలతో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణ పర్యటనపైనా కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. బండి సంజయ్ కుమారుడి కేసు వ్యవహారం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశం గురించి కేసీఆర్‌కు బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ వివరించినట్లు సమాచారం. కొత్తగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపైనా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ చర్చించారు. అలాగే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బలంగా పోరాటాలు చేయాలని నేతలను కేసీఆర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీ బలోపేతం, కొత్త కమిటీల నియామకంపై దృష్టి సారించారు.

## నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

- పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి
- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్, మే 12 :** దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలన్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## భగీరథ్ కేసులో నా వ్యాఖ్యలు వక్రీకరించారు

- బాధితురాలికి కూడా న్యాయం జరగాలని కోరా
- మరోమారు వివరణ ఇచ్చిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, మే 12 :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని మాత్రమే తాను మాట్లాడానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేసే అంశంపైనే తాను మాట్లాడానని.. తన మాటలను కొంతమంది వక్రీకరించారని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం మాట్లాడారు. ఈ కేసులో భగీరథ్ విచారణ ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని తాను అన్నానని ప్రస్తావించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మున్నూరు కాపు సంఘాలు ఆరోపణలు చేశాయని అన్నారు. ఈ కేసులో బాధితురాలు కూడా అదే సామాజిక వర్గమని తాను చెప్పానని ప్రస్తావించారు. తన ఉద్దేశంలో కూడా బాధితురాలికి న్యాయం జరగాలనే తపన మాత్రమే ఉందని అన్నారు. ఇందులో ఎక్కడ కూడా కాంప్రమైజ్ కావాలని తాను మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. బాధితురాలికి కాంగ్రెస్ అండగా ఉంటుందని.. వారికి పూర్తిగా మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తాను పోరాడతానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## భగీరథ్‌కు సిట్ నోటీసులు

**నేడు విచారణకు రావాలని ఆదేశం**



**హైదరాబాద్, మే 12 :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు. సిట్ అధికారులు బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌ను విచారించనున్నారు. ఈ కేసుకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధితురాలి స్టేట్‌మెంట్ నమోదు చేసిన అనంతరం పోలీసులు ఈ కేసులోని సెక్షన్లను మార్చారు. గతంలో నమోదు చేసిన పోక్సో యాక్ట్ సెక్షన్లను సవరించారు.

## తరుగు, తేమ పేరుతో దోపిడీ

**రైతు ఆందోళనకు ఎమ్మెల్యే మద్దతు**

**మెదక్, మే 12 :** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ, తరుగు పేరుతో రెండు కిలోలకు పైగా అదనంగా తీసుకుంటున్నారని, దీన్ని వెంటనే నిలిపియాలని నర్సాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని జాతీయ రహదారిపై రైతులు, బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు మద్దతుగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వం లారీల సమస్య, హమాలీల సమస్యను వెంటనే పరిష్కరించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే శివంపేట మండలం చిన్న గొట్టిముక్కల చౌరస్తా వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా చేశారు. రైతుల ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రైతులను బుజ్జగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం

**గోడౌన్‌లో మంటలు చెలరేగి వాహనాలు దగ్ధం**

**సంగారెడ్డి, మే 12 :** సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పటాన్‌చెరులోని శ్రీరామ్ ఆటో ఫైనాన్స్‌కు చెందిన వాహనాల గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో మూడు టిప్పర్లు, డీసీఎం, రెండు ఆటోలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోడౌన్‌లో నిల్వ ఉంచిన వాహనాల మధ్య నుంచి మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చడంతో గోడౌన్ మొత్తం దగ్ధమైంది. అక్కడ పార్క్ చేసిన పలు కార్లు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉదయనిధి మరోమారు అనుచిత వ్యాఖ్యలు

**సనాతన ధర్మంపై నోరు పారేసుకున్న డిఎంకె నేత**

**ఉదయనిధి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేత**

**చెన్నై,మే12 :** తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మరోసారి సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మూడేళ్ల క్రితం ఉదయనిధి సనాతన ధర్మంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాతో పోల్చుతూ దానిని నిర్మూలించాలని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పలువురు కోర్టులలో పిటిషన్లు కూడా వేశారు. తాజాగా, మంగళవారం మధ్యాహ్నం తమిళనాడు అసెంబ్లీలో కూడా ఉదయనిధి అదే తరహా వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని అసెంబ్లీ వేదికగా ప్రసంగించారు. అసెంబ్లీ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన జె.సి.డి. ప్రభాకర్‌ను అభినందిస్తూ చేసిన ప్రసంగంలో ఉదయనిధి స్టాలిన్ ఈ వ్యాఖ్య చేశారు. ఉదయనిధి వ్యాఖ్యలపై తమిళనాడు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసన్ ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ఆయన మారలేదని విమర్శించారు. డీఎంకే నిజంగా ఇదే సిద్ధాంతాన్ని నమ్మితే ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు హిందూ మతాన్ని నిర్మూలించడమే ఉదయనిధి స్టాలిన్, డీఎంకేల విధానమైతే, దానిని వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచార సమయంలో ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మం నిర్మూలన గురించి ఎందుకు మాట్లాడలేదు. ఎన్నికల ప్రచారం చివరి రోజున 'మేం హిందువులకు వ్యతిరేకం కాదు' అని స్టాలిన్ ఎందుకు చెప్పుకున్నారు' అని శ్రీనివాసన్ ప్రశ్నించారు.

## చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ

- ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం
- అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష



**హైదరాబాద్, మే 12 :** తెలంగాణ రాష్ట్రంలో చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల సమీక్షా సమావేశం మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్స్ అథారిటీ కార్యకలాపాలు, వెట్‌ల్యాండ్స్ కాలుష్య నియంత్రణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు. ఈ సమావేశానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల పునరుద్ధరణ, అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. వెట్‌ల్యాండ్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అక్రమ నిర్మాణాలు, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పక్షులు, జలచరాలు, పర్యావరణ సమతుల్యతకు వెట్‌ల్యాండ్స్ కీలకమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో వెట్‌ల్యాండ్స్ పాత్ర అత్యంత ముఖ్యమని, వాటి సంరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వెట్‌ల్యాండ్స్ మ్యాపింగ్, మానిటరింగ్ పక్రియపై కూడా సమావేశంలో చర్చించారు. చెరువుల స్థితిగతులు, ఆక్రమణలు, కాలుష్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షించాలని అధికారులు అభిప్రాయపడ్డారు. చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంరక్షణలో కూడా వెట్‌ల్యాండ్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెట్‌ల్యాండ్స్ సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, జీవ వైవిధ్య పరిరక్షణలో కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

## వ్యక్తిగత హక్కులకు భంగం

- అనుమతి లేకుండా పేరు, ఫోటోల వాడకం
- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన నటుడు నాగార్జున



**న్యూఢిల్లీ, మే 12 :** తన వ్యక్తిగత హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ ఢిల్లీ హైకోర్టును సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా పేరు, ఫొటోలను వాడుకుంటున్నారని హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఓ బట్టల వ్యాపారి దుస్తులపై తన చిత్రాలు, పేరు వాడుతున్నాడని కోర్టు దృష్టికి నాగార్జున తీసుకెళ్లారు. ఈ కేసుపై నేడు విచారణ చేపట్టిన న్యాయస్థానం సదరు వ్యాపారిపై సీరియస్ అయ్యింది. నాగార్జున టీ షర్టులు మీరెలా అమ్ముతారంటూ వ్యాపారిని హైకోర్టు ప్రశ్నించింది. ఫొటోలను వాణిజ్యపరంగా వాడుకునే అధికారం మీకు ఎవరిచ్చారంటూ కోర్టు నిలదీసింది. తొలుత వ్యాపారి తరపు న్యాయవాది శృతి అయ్యర్ వాదనలు వినిపిస్తూ 'ది ఘోస్ట్' సినిమాకు తాము అధికారిక మర్చండైజింగ్ భాగస్వాములమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి తమకు కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. ఓ మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా ప్రొడక్షన్ హౌస్‌తో తమకు ఒప్పందం ఉందని.. నాగార్జున స్వయంగా ఆ వస్తువులను ప్రమోట్ చేశారని స్పష్టం చేశారు. దీనిపై నాగార్జున తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒప్పంద పత్రాలు అడిగినప్పటికీ సమర్పించ లేదని, కోర్టుకు ఇచ్చిన ఈ-మెయిల్ కాపీలు సైతం అసంపూర్ణంగా ఉన్నాయని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చివరికి, ఈ వ్యవహారంలో తమకు నాగార్జునతో కానీ, సంబంధిత నిర్మాణ సంస్థతో కానీ ఎటువంటి ప్రత్యక్ష ఒప్పందం లేదని న్యాయస్థానం ముందు వ్యాపారి అంగీకరించారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. నాగార్జున, ప్రొడక్షన్ హౌస్‌తో ప్రత్యక్ష ఒప్పందం లేదని మీరే అంగీకరిస్తున్నప్పుడు.. టీ షర్టులను విక్రయించే చట్టబద్ధత ఎక్కడి నుంచి వచ్చిందని సీరియస్ అయ్యింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది

## చిన్నారి హత్య కేసులో నిందితుడికి మరణ శిక్ష

**కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు**

**హైదరాబాద్, మే 12 :** ఓ బాలుడి హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. చిన్నారిని హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష విధించింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లో 2023 సంవత్సరంలో జరిగిన మైనర్ హత్యోదంతం సంచలనం సృష్టించింది. ఇమ్రాన్ అలీ ఖాన్ (33) అనే వ్యక్తి చిన్నారిని హత్య చేయగా.. అతనికి మహమ్మద్ రఫీక్ (32) సహకరించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీసులు అప్పుడే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఇమ్రాన్ అలీ ఖాన్, మహమ్మద్ రఫీక్‌ను గుర్తించి అరెస్టు చేశారు. కేవలం సాంకేతిక సాక్ష్యాలతో కేసును ఛేదించి.. వివరాలను కోర్టుకు సమర్పించారు. పకడ్బందీగా సాక్ష్యాలు ఉండటంతో సంతృప్తి చెందిన కూకట్‌పల్లి కోర్టు.. చిన్నారిని వారే హత్య చేసినట్లు నిర్ధారిస్తూ దోషులుగా తేల్చింది. ఇమ్రాన్ అలీ ఖాన్‌కు మరణశిక్ష, అతనికి సహకరించిన మహమ్మద్ రఫీక్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటేశ్వర రావు తీర్పు వెలువరించారు.



## అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

**ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు**

**ఎన్‌డి ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక**

**గౌహతి, మే 12 :** అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు. హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

ఆర్గాన్ న్యూస్
4
తెలంగాణ
బుధవారం
13 మే 2026
www.organnews.in
organ.today@gmail.com
@organnews

# ఖర్చులు తగ్గింపు.. మోడీ నుంచే మొదలవ్వాలి!



**మంచో చెడో.. ప్రధాని మోడీ చేసిన ఓ సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా మారాల్సి ఉంది. దీనిపై పైనుంచి కింది వరకు చర్చించాలి. అదేంటంటే ఖర్చులు తగ్గించాలి. బంగారం కొనగూడదు.. ఇంధనం తగ్గించుకుని వాహనాలను మూలన పెట్టాలి. లేదా తక్కువ మోతాదులో ఇంధనం వాడుకోవాలి. దేశహితం కోసం ఇది మంచిదే. అయి-ఎతే ఎవరు ఖర్చులు తగ్గించాలన్నదే ముఖ్యం. దేశ అర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ముందుగా ఖర్చుల జాబితాను రూపొందించి తగ్గించాలి. ప్రధాని మొదలు, ఎమ్మెల్యేల వరకు ఖర్చులు తగ్గించే ప్రయత్నం నేటినుంచే మొదలు పెడితే మంచిది. ఇందులో ప్రధానంగా రాజకీయ నాయకలు నుంచి తగ్గింపు మొదలైతే దేశం దరిద్రం పోతుంది. ముందుగా వారి జీతభత్యాల్లో కోత పెట్టాలి. వేలకోట్లు జీతభత్యాలు, విమాన ఖర్చులు, కార్లు, కాన్వాయ్‌ల ఖర్చులు వెంటనే కోత విధించాలి.**

అక్షర నిజం

ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలు ఇంధన వినియోగం, బంగారం కొనుగోళు ్లు, వంట నూనెల వినియోగం 10 శాతం తగ్గించుకుని, ఎరువుల దిగుమతులను 50శాతం మేర తగ్గించి, అనవసర విదేశీ పర్యటనలను మానుకుంటే.. ఏడాదిలో 4500 కోట్ల డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఆదా చేయొచ్చని ఒక అంచనా. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.4.3 లక్షల కోట్లు అన్న మాట. ఇది మంచి సలహా గనక ఎవరు తగ్గించుకోవాలన్న చర్చ మొదలు పెట్టాలి. అందుకే రాజకీయంగా అవుతున్న దుబారాను ముందుగా తగ్గించాలి. ఈ ఖర్చులు తగ్గితే విదేశీ మారకం నిల్వలు పెరుగుతాయి. దేశ జిడిపి పెరుగుతుంది. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు దక్కుతాయి. రాజకీయ నాయకులు జీతభత్యాలు, కార్లు, విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులు, అనవసరంగా విదేశీ టూర్లు, ఉచిత పథకాలు వంటివన్నింటిపైనా బ్యాన్ విధించాలి. ముందుగా ప్రధాని మోడీ టూర్లు తగ్గాలి. సిఎంల ప్రమాణాలకు సిఎంలను, కేంద్రమంత్రులను పిలవడం వల్ల ఎంత ఖర్చయ్యిందో లెక్కలు చెప్పాలి. అట్టహాసపు ప్రమాణ స్వీకారాల ఖర్చును దేశంపై రుద్దడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. చంద్రబాబు లాంటి వారు హెలికాప్టర్లు వేసుకుని పెన్షన్లు పంచడానికి వెళ్లడాన్ని నిషేధించాలి. అనవసర ఖర్చులతో రాష్ట్ర ఖజనాలను గుల్లచేసిన వారినుంచి ఆ మొత్తాలను రాబట్టాలి. ఇందుకోసం ఎంతటి కఠిన నిర్ణయమైనా తీసుకున్నా ఫర్వాలేదు.

దేశ ఆర్థిక వ్యవస్థ బాగా ఉందంటే...అందుకు విదేశీ మారక నిల్వల మొత్తమే రుజువు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ఒక దేశం ఎంత ధనికమైనది, ఎంత సురక్షితమైనది అని చెప్పడానికి ఈ ఫారెక్స్ రిజర్వులు కొలమానం లాంటివి. ఇవి తగ్గుతాయంటే మనం దిగుమతులను తగ్గించాలి. మన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకోవాలి. ఇక్కడ రైతులు ధాన్యం కొనుగోళ్లు లేక దిగాలు పడుతున్నారు. అందువల్ల దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తువులను వాడుదాం. అప్పుడు కూడా భారీగా ఖర్చులు తగ్గుతాయి. మోడీ ఇచ్చిన సలహాలను పాజిటివ్‌గా తీసుకుంటే మంచిదే. అయితే ఇది రాజకీయ నాయకులకు మాత్రమే హెచ్చరిక కావాలి. వారే తమ ఇంటి నుంచి సంస్కరణలు ప్రారంభించాలి. ఇకపోతే ప్రధాని మోడీ తన ప్రసంగంలో బంగారం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఏంటంటే.. భారతీయులు ఏడాదికి సగటున కొనే పసిడి దాదాపు 700–900 టన్నులని అంచనా! దీని విలువ సుమారు రూ.13.69 లక్షల కోట్లు. 2024–25తో పోలిస్తే.. 2025–26లో మన బంగారం దిగుమతులు దాదాపు 24శాతం పెరిగాయి. భారతీయులు కొనే బంగారంలో 90 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. అందుకు మనం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కాబట్టి మోడీ చెప్పినట్లు ఏడాది పాటు బంగారం కొనకుండా ఉంటే కచ్చితంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై భారం కాస్తంతైనా తగ్గుతుంది. ఇందులో ఉన్నత వర్గాల వారి కొనుగోళ్లే ఎక్కువని గుర్తించాలి. ఉన్నత వర్గాల వారు సైతం బంగారం కొనుగోళ్లు చేపట్టకుండా చూడాలి. బంగారం దిగుముతలపై ఆంక్షలు విధించాలి. దీంతో దేశీయంగా ఇళ్లల్లో మూలుగుతున్న బంగారన్ని బయటకు తీసి ఆదాయ వనరుగా మార్చాలి. ఇవన్నీ చేయగలుగుతామని చెప్పాలి.

ఇకపోతే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టినప్పుడు, సామాన్యుడు తన కష్టాలన్నీ తీరిపోతాయని, భవిష్యత్తు బంగారం అవుతుందని కలలుగన్నాడు. కానీ కలలు కల్లలు అయ్యాయి. వస్తూత్పత్తి పెరిగింది. దాన్యం దిగుబడులు పెరిగాయి. కానీ ధరలు అమాంతంగా అంతకు రెట్టింపు అయ్యాయి. విద్యవైద్యం ఖరీదైన వస్తువుగా మారింది. అందుకే ప్రధాని మోడీ మాటలను సానుకూలంగా తీసుకుని నిజాన్ని మాట్లాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అచ్చే దిన్ అన్న మోడీ మంచి రోజులు నిజంగా సామాన్యుడి ముంగిట నిలిచాయా అన్నది కూడా చర్చించాలి. కానీ నినాదాల హోరులో నిజాలు సమాధి అయ్యాయి. ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే భారతదేశం వెలిగిపోతున్నట్లు కనిపిస్తున్నది. కానీ సామాన్యుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ ఇండియా విప్లవం, మేక్ ఇన్ ఇండియా అంటూ భారీ నినాదలు బయలుదేరాయి. కానీ రాజకీయ నాయకులు బలపడుతున్నారు. ప్రజలు బలహీన పడుతున్నారు. రాజకీయ నాయకులకు ఊడిగం చేసే దౌర్భాగ్యం పెరుగుతోంది. ఒక దేశంగా మనం ఎంత గర్వంగా తలెత్తుకుంటున్నామో, అదే స్థాయిలో అప్పుల భారంతో తల దించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. అందుకే ఖర్చులు తగ్గించుకోవడం అవసరమే. అది రాజకీయ నాయకలు నుంచి మొదలు కావాలి. మోడీ ఒక నిర్ణయం తీసుకుని పార్లమెంటులో చట్టం చేయాలి. రాజకీయ నాయకుల జీతభత్యాలు, పెన్షన్లు ఎత్తేయాలి. విదేశీ టూర్లు, విమాన ఖర్చులపై ఆంక్షలు విధించాలి. ఉచిత పథకాలను ఎత్తేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మోడీ కోరుకున్న ఖర్చుల తగ్గింపు ఆలోచన కార్యరూపం దాలుస్తుంది.

13-05-2026 ఎడిటర్

# తమిళ సీఎం విజయ్ సంచలన నిర్ణయం

- బడులు, గుడులు, బస్టాండ్ల వద్ద వైన్ షాప్‌ల ఎత్తివేత
- రెండు వారాల్లోగా మూసేయాలంటూ ఆదేశాలు
- విజయ్ సోషల్ మీడియాకు పెరుగుతున్న ఆదరణ

**చెన్నై, మే 12 :** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్‌స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నిం టినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు వారాల్లోగా మూసివేయాలని అధికారుల ను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి ఉత్తర్వు ఇది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.



# తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్

## డిప్యూటీ స్పీకర్‌గా రవిశంకర్ ఎన్నిక



**చెన్నై, మే 12 :** తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీవీకేకు చెందిన మరో ఎమ్మెల్యే రవిశంకర్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరప్పయ్య తెలిపారు. తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్టు కరుప్పయ్య ప్రకటించారు. ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సభానేత కేఏ సెంగోట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు. ఆయనకు అభినందనలు తెలిపారు. స్పీకర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నికను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పదవికి తురైయూర్ టీవీకే ఎమ్మెల్యే ఎం.రవిశంకర్ ఒక్కరే నామినేషన్ వేశారని, దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందని ప్రభాకర్ ప్రకటించారు. రవిశంకర్ నామినేషన్‌ను సెంగోట్టియన్ ప్రతిపాదించారు.

# మోడీ ఉపయోగించే విమానం అమ్మేయాలి

## అప్పడే ఖర్చులు తగ్గించుకోవడం సాధ్యం
## స్వామి అవిముక్తేశ్వరానంద సంచలన వ్యాఖ్యలు

**లక్నో, మే 12 :** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని మోదీ కొన్ని పొదుపు సూచనలు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ పర్యటన సమయంలో ఆయన బహిరంగ సభలో పాల్గొని కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలన్నారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు ఆపాలన్నారు. డీజిల్, పెట్రోల్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రజా రవాణా వ్యవస్థపై ఎక్కువగా ఆధారపడాలని సూచించారు. రాబోయే కరువు, దారిద్ర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ ఆ సూచన చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రధాని పొదుపు సూచనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దుబారా ఖర్చులు చేయవద్దు అంటే ముందుగా ప్రధాని వినియోగించే సుమారు 8 వేల కోట్ల ఖరీదైన ఎయిర్ ఇండియా వన్ విమానాన్ని అమ్మేయాలని స్వామి అవిముక్తేశ్వరానంద అన్నారు. ఆ విమానానికి బదులుగా ఇంధనం తక్కువ ఖర్చు అయ్యే విమానాలను వాడాలని స్వామీజీ విమర్శించారు. ఖర్చులు తగ్గించు కోవాలని ప్రజలకు చెప్పడం కాదు, ముందుగా ఆ విమానాన్ని అమ్మేసేయాలని ఆయన అన్నారు. యూపీలోని సోన్‌భద్రతలో జరిగిన గోవిష్ట్ యాత్రలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పొదుపు అనేది అధికారంలో ఉన్న వ్యక్తుల నుంచే మొదలు కావాలని ఆయన అన్నారు. ధర్మం అనేది ఇంటి నుంచే మొదలు కావాలని అవిముక్తేశ్వరానంద అభిప్రాయపడ్డారు.

# అన్నా డీఎంకేలో లుకలుకలు

- పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు
- టివికెకు మద్దతు ప్రకటించిన షణ్ముగం వర్గం



**చెన్నై, మే 12 :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకేలో లుకలుకలు బయటపడ్డాయి. పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు మొదలయ్యింది. తాజాగా ఆ పార్టీలోని సీవీ షణ్ముగం వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగంకు మద్దతు ప్రకటించింది. ఆయన వర్గంలో 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. డీఎంకేతో చేతులు కలపాలని అన్నాడీఎంకే అనుకుందని, అందుకే పళనిస్వామి వర్గం నుంచి తాము విడిపోయామని మంగళవారం మీడియాతో మాట్లాడుతూ షణ్ముగం తెలిపారు. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు చెప్పారు. వరుస ఓటములకు పళనిస్వామే కారణమని విమర్శించారు. పార్టీ పదవి నుంచి ఆయన దిగిపోవాలని డిమాండ్ చేశారు. అన్నాడీఎంకే గత దశాబ్ద కాలంగా పలు ఓటములను చవిచూసిందని, మూడుసార్లు చిరకాల ప్రత్యర్థి డీఎంకే చేతిలో ఓడిపోతే, గత నెలలో టీవీకే చేతిలో మరో ఓటమి చవిచూసిందని షణ్ముగం తెలిపారు. పార్టీని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్నాడీఎంకే భవిష్యత్తుపై కూలంకషంగా చర్చించాలని అన్నారు. ఎన్నికల్లో విజేతగా నిలిచిన టీవీకేకు మద్దతివ్వాలని మేము నిర్ణయించాం. డీఎంకేకు వ్యతిరేకంగానే అన్నాడీఎంకే పార్టీని స్థాపించడం జరిగింది. 53 ఏళ్లుగా డీఎంకేకు వ్యతిరేకంగానే పార్టీ రాజకీయాలు నడిచాయి. చరిత్ర ఇలా ఉంటే డీఎంకే మద్దతుతో అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు కావాలనే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అయితే మెజారిటీ సభ్యులు ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు. డీఎంకేతో పొత్తు పెట్టుకోవడం అంటే అన్నాడీఎంకే సొంత ఉనికి కోల్పోవడమే అవుతుంది. ప్రస్తుతం మా దృష్టి ఉంతా పొత్తులపై లేదు. సొంత పార్టీని పునరుద్ధరించి, పటిష్టం చేయడమే మా ఉద్దేశం. అంతిమంగా ఎన్నికల్లో విజయం సాధించిన టీవీకేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించాం' అని షణ్ముగం తెలిపారు. సొంత పార్టీని చీల్చే ఉద్దేశం లేదని షణ్ముగం వివరణ ఇచ్చారు. పార్టీ కీలక నాయకత్వంపై పోరాటంగా దీనిని పేర్కొన్నారు. ముఖ్యంగా విజయ్, టీవీకేతో పొత్తుకు గత వారంలో నిరాకరించిన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి వ్యతిరేకంగా తామంతా తీసుకున్న నిర్ణయమని చెప్పారు.

# బండి కుమారుడిని తప్పించే యత్నం

- సిట్ విచారణ పేరుతో కాలయాపన
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు



**నిజామాబాద్, మే 12 :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసు, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడని అనడం హాస్యాస్పదమని అన్నారు. సిట్ విచారణ పేరిట నిందితుడిని సీఎం రేవంత్ రెడ్డి తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒక మైనర్ బాలికకు డ్రగ్స్ ఇచ్చి, మద్యం తాగించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తున్నా.. పోలీసులు మూడు నెలలుగా ఫిర్యాదు తీసుకోకుండా తాత్సారం చేయడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మీడియాలో వార్తలు వచ్చిన వెంటనే గత్యంతరం లేక పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. పోక్సో కేసులో బాధితురాలికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ఆమెపైనే హనీట్రాప్ కేసు పెట్టడం దారుణమని మండిపడ్డారు. మైనర్ బాలిక హనీట్రాప్ చేస్తుందా అని ప్రశ్నించారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒక్కటేనని అర్థమవుతుందని అన్నారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒకటేనని అర్థమవుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ది ఫెవికాల్ బంధమని విమర్శించారు. వీళ్లిద్దరూ కలిసి వ్యాపారాలు చేస్తున్నారని, కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రి కొడుకుపై ఇంత పెద్ద నేరం మోపబడినా ప్రభుత్వం మిన్నకుండిపోయిందని అన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా దీనిపై స్పందించకపోవడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. పొద్దున లేస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మీద విషం చిమ్మే బండి సంజయ్.. తన కొడుకు చేసిన నేరంపై ఏం సమాధానం చెబుతారని వేముల నిలదీశారు. తన కొడుకుపై వచ్చిన పోక్సో కేసుపై నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని.. ఈ కేసులో రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని.. బాధితురాలికి, ఆమె కుటుంబానికి తక్షణమే పూర్తిస్థాయి రక్షణ కల్పించాలి అని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులు ఇప్పటికైనా ఒత్తిళ్లకు లొంగకుండా చట్టాన్ని గౌరవించాలని, బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని స్పష్టం చేశారు.

# 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

## రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి, మే 12 :** ఏపీలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై 24 గంటల్లోనే కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. వాహనదారులకు వేగవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. డీలర్ టెంపరరీ రిజిస్ట్రేషన్ అనంతరం 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ కు ఆమోదం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఫ్యాన్సీ నంబర్ వాహనాలకు మాత్రమే మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. గడువులోపు సంబంధిత అధికారులు స్పందించకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ ఆమోదం అయినట్లు పరిగణించనున్నట్లు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్‌ను ఆమోదిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, సులభంగా సేవలు అందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కొత్త విధానం అమలు చేయనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు.

# మూడు చోట్ల చైన్ స్నాచింగ్‌లు

## ఆందోళనలో స్థానిక ప్రజలు

**వరంగల్, మే 12 :** జిల్లాలో చైన్ స్నాచర్లు, పోకిరీల రెచ్చిపోతున్నారు. సోమవారం రాత్రి మూడు చోట్ల చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒక వ్యక్తితో సహా ఇద్దరు మహిళల మెడలో బంగారు గొలుసులను దొంగలు తెంచుకెళ్లారు. ఈ సంఘటనలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. వరంగల్ మిల్స్ కాలనీలో పోకిరీలు హంగామా సృష్టించారు. రాత్రి సమయంలో కొందరు యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలోని ఓ టీ స్టాల్ యజమానిపై పోకిరీలు దాడి చేశారు. దాడిలో టీ స్టాల్ యజమాని తీవ్రంగా గాయపడ్డాడని, అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. నగరంలో పోలీసు పెట్రోలింగ్ పూర్తిగా కనిపించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.



# బైకును ఢీకొని బోల్తాపడ్డ కర్నాటక ఆర్టీసీ బస్సు

## ప్రమాదంలో ముగ్గురు మృతి

**సంగారెడ్డి, మే 12 :** కర్ణాటకలోని బీదర్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారి పై వెళ్తున్న బైక్‌ను కర్ణాటక రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు ఢీ కొట్టింది. అనంతరం ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బీదర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల్లో ఇద్దరు సంగారెడ్డి జిల్లా వాసులు ఉన్నారని పోలీసులు వివరించారు. బీదర్ నుంచి ఆర్టీసీ బస్సు హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్పారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం బీదర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై మృతుల కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

ప్రాంతీయం

## ఖరీఫ్ సీజన్‌కు ముందే
# రైతు రిజిస్ట్రీ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- నకిలీ విత్తనాలు, ఎరువుల నియంత్రణకు శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ
- ఏఈవోలు క్షేత్ర స్థాయిలో వంద శాతం క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలి
- పట్టణ ప్రాంతాల్లో విలీనమైన గ్రామాల్లో రైతు రిజిస్ట్రీని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలి
- ఆయిల్ పామ్ సాగు లక్ష్యాల సాధనకు వ్యవసాయ, ఉద్యానవన శాఖలు కలిసి పనిచేయాలి
- నకిలీ విత్తనాలపై సమాచారం కోసం జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి
- వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్





**ఆర్గాన్ న్యూస్, ఖమ్మం, మే12:** ఖరీఫ్ సాగు సీజన్‌కు ముందే రైతు రిజిస్ట్రీ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వ్యవసాయ శాఖ అధికా రులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ, రవాణా శాఖ, సీడ్ కార్పొరేషన్, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని ఆదేశించారు. రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు సమృద్ధిగా అందుబాటు లో ఉన్నాయని చెప్పారు. నకిలీ విత్తనాల నియంత్రణ కోసం జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విత్తన గోదాములు, సీడ్ షాపులపై నిరంతరం తనిఖీలు నిర్వహించి విత్తనాల నాణ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రైతులు తప్పనిసరిగా లైసెన్స్ పొందిన విత్తన షాపుల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కొంతమంది వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ రైతులను మభ్యపెట్టి నకిలీ విత్తనాలను విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి మోసాలను అరికట్టేందుకు రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రైతు వేదిక సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొని గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండల స్థాయి టాస్క్ ఫోర్స్ బృందాలు చేపట్టిన చర్యల అనంతరం క్రమం తప్పకుండా మీడియా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నకిలీ విత్తనాలపై సమాచారం అందించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేక ఫోన్ నంబర్‌ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులను అప్రమత్తం చేయడంలో అవగాహన కార్యక్రమాలు కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఏఈవోలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వంద శాతం క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు రిజిస్ట్రీని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచిస్తూ, ప్రతి ఏఈవో రోజుకు 20 రైతు రిజిస్ట్రీలు, ప్రతి ఎంఏవో 30 రైతు రిజిస్ట్రీలు పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో విలీనమైన గ్రామాల్లో రైతు రిజిస్ట్రీ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సాగు ప్రారంభానికి ముందే రైతు రిజిస్ట్రీ పూర్తి కావాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రైతు రిజిస్ట్రీ ఆధారంగానే అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరా నిర్వహించబ డుతుందని తెలిపారు.

ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదే శించారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖలు సమన్వ యంతో పనిచేస్తూ ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను సాధిం చేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల ని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, వ్యవసాయ, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో
# రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఆర్గాన్ న్యూస్, ఖమ్మం, మే12:** మొక్కజొన్న,ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు లతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఖమ్మం ఐడీఓసీ నుండి పాల్గొన్నారు. జిల్లాకలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో 2 లక్షల 22 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 2 లక్షల 78 వేల టన్నుల మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు చేరినట్లు తెలిపారు. గత వారం రోజుల్లోనే లక్షా యాభై వేల టన్నుల అదనపు నిల్వ సామర్థ్యాన్ని సృష్టించి కొనుగోళు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎస్ఓ చందన్ కుమార్, డిఆర్డిఓ శ్రీరామ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిసిఓ గంగాధర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీం, ఇంచార్జ్ డిఎం సివిల్ సప్లై సునీల్ రెడ్డి, ఆర్టీఓ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రైతు ముంగిట శాస్త్రజ్యోతి

- శాస్త్రవేత్తల సూచనలతో లాభసాటి సాగుకు దిశానిర్దేశం
- వేంసూర్ మండలం కె.జి.మల్లెలలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ఘనవిజయం
- భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగంపై అవగాహన
- ఆయిల్‌పామ్, కొబ్బరి, వరి సాగులో ఆధునిక పద్ధతుల వివరణ
- డ్రిప్, సబ్సిడీలు, పంట మార్పిడిపై రైతులకు కీలక సూచనలు

**అశ్వారావుపేట, ఆర్గాన్ న్యూస్, మే 12:** వ్యవసాయాన్ని శాస్త్రీయ దిశగా నడిపిస్తూ రైతులకు లాభసాటి సాగుపై అవగాహన కల్పించే లక్ష్యంతో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ఖమ్మం జిల్లా వేంసూర్ మండలం కె.జి.మల్లెల గ్రామంలో ఘనంగా జరిగింది. గ్రామీణ రైతాంగానికి నేరుగా శాస్త్రీయ సలహాలు అందించే ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డా. ఎం. రామ్ ప్రసాద్ మాట్లాడుతూ, భూసార పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువుల మోతాదును నిర్ణయించాలని రైతులకు సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సేంద్రియ వ్యవసాయం అవసరమని, మట్టి నమూనాల సేకరణలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ఆయిల్‌పామ్ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను సూచిస్తూ, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, కొబ్బరి మొక్కల లభ్యతపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే డా. పి. ఝాన్సీ రాణి మార్కెట్‌లో అధిక గిరాకీ ఉన్న వరి రకాల లక్షణాలను రైతులకు వివరించారు. పచ్చిరొట్ట పంటల వల్ల నేల సారవంతం పెరుగుతుందని, పంట మార్పిడి విధానం ద్వారా దిగుబడులు మెరుగుపడటమే కాకుండా వ్యాధుల నివారణ సాధ్యమవుతుందని చెప్పారు. ఉద్యాన విస్తరణ అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, డ్రిప్ ఇరిగేషన్ పథకాలు, కూరగాయల సాగులో పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. గ్రామ సర్పంచ్ నరసింహారావు మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలు రైతులకు మార్గదర్శకమని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తే ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వాతి, వ్యవసాయ విస్తరణ అధికారులు సందీప్, స్వాతి, రీమా, విద్యార్థులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఘనంగా ప్రజా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక
### చైర్మన్ షేక్ దస్తగిర్

**దమ్మపేట, ఆర్గాన్ న్యూస్, మే 12:** దమ్మపేట మండల కేంద్రంలో ప్రజా ప్రెస్ క్లబ్‌కు సంబంధించిన నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది. చైర్మన్ షేక్ దస్తగిర్, వైస్ చైర్మన్ మేకల ఉపేంద్ర, నూతన కార్యదర్శిగా నడ్డి సాయి, ప్రచార కార్యదర్శిగా ఎండి సాలార్, కోశాధికా రిగా నీలం రాజేశ్వరి సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. చైర్మన్ షేక్ దస్తగిరి మాట్లా డుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం కృషి చేస్తామని, జర్నలి స్టుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతా మని తెలిపారు. కార్యదర్శి మాట్లాడుతూ, సభ్యుల సహకా రంతో ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

“

### మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే ప్రభుత్వం ఊరుకోదు
**బీర్ల అయిలయ్య**

**హైదరాబాద్:** బండి సంజయ్‌ని కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య డిమాండ్ చేశారు. బండి సంజయ్ శ్రీరామునిపై ప్రమాణం చేసి తన కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని చెప్పాలని, భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా తన కుమారుడు నిర్దోషి అని నిరూపించుకోవాలన్నారు. ఆయన మంగళవారం అసెంబ్లీ ఆవరణలోని సీఎల్పీ మీడియా హాలులో మాట్లాడారు. 'మైనర్ బాలికదే తప్పన్నట్టు బండి సంజయ్ సోషల్ మీడియాలో చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. భాజపా మంత్రి కుమారుడి కేసుతో పార్టీకి సంబంధం లేదని ఆ పార్టీ అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడటం అన్యాయం. మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే ప్రభుత్వం సహించదు. మహిళా ఐపీఎస్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. మైనర్ బాలిక కేసును హరీశ్‌రావు రాజకీయంగా ఉపయోగించుకోవడం దారుణం. మాకు భాజపాతో ఒప్పందం ఉంటే 8వ తేదీనే కేసు ఎందుకు నమోదు చేస్తాం?' అని అయిలయ్య ప్రశ్నించారు.



## భద్రాచలంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 12:** భద్రాచలం వెంకటేశ్వర కాలనీలోని శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో విశేష పూజల ఘనంగా జరిగాయి. ప్రధాన కార్యక్రమాలు హనుమాన్ జయంతి ని పురస్కరించుకుని స్వామి వారికి విశేషంగా ఆకు పూజ నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవం: లోక కల్యాణం కోసం శ్రీ సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా, కనుల పండువగా నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ: కల్యాణం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. భక్తుల సందడి: ఈ వేడుకను తిలకించడానికి భద్రాచలం పరిసర ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులంతా స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించి పునీతులయ్యారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న బోగాల శ్రీనివాస రెడ్డి దంపతులు అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని స్వామివారి సేవలో తరించిన లో భోగాల శ్రీనివాస రెడ్డి, విష్ణుమొలకల రామ్ ప్రసాద్, రేపాక రాంబాబు, రేపాక రవికిరణ్,రేపాక సతీష్,పునేం కృష్ణ సర్పంచ్, వెంకటేశ్వర్లు తాసిల్దార్, పుల్లయ్య ఆర్టీవో, తాండ్ర నరసింహారావు, అన్నెం రామిరెడ్డి, రాసమల్ల రాము,పద్మ, వసంతల రాజేశ్వరి, తుమ్మల రాణి తదితరులు ఉన్నారు. వీరితో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్త సమాజం, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## సోలార్ విలేజ్‌గా రఘునాథపాలెంను
# అభివృద్ధి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- కమ్యూనిటీ భవనాలపై కూడా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలి
- సెన్సస్--2027 సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలి
- తప్పుడు సమాచారం ఇవ్వకుండా సరైన వివరాలు నమోదు చేయాలి
- రఘునాథపాలెంలో సోలార్ మోడల్ ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఆర్గాన్ న్యూస్, రఘునాథపాలెం, మే 12 :** జిల్లాలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా రఘునాథపాలెం గ్రామాన్ని సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థ కలిగిన పైలట్ గ్రామంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. రఘునాథపాలెం గ్రామంలో అమలవుతున్న సోలార్ మోడల్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌ల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 1081 మంది గృహజ్యోతి లబ్ధిదారులు ఉన్నారని, వారిలో 821 ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయడానికి అనుకూల పరిస్థితులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 110 ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు పూర్తయిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... రఘునాథపాలెంను భవిష్యత్తులో "సోలార్ విలేజ్"గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రతి ఇంటికి కనీసం 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్రామంలోని కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలు, ఇతర సామూహిక ప్రదేశాలపై కూడా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సోలార్ రూఫ్‌టాప్‌ల ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో జరుగుతున్న సెన్సస్--2027 కార్యక్రమంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. జనగణన సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజలు సరైన సమాచారాన్ని అందించాలని, ఎటువంటి అపోహలకు లోనుకాకుండా తప్పుడు సమాచారం ఇవ్వవద్దని సూచించారు. జనగణన కారణంగా ఎలాంటి ప్రభుత్వ పథకాలు ప్రభావితం కావని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ వహీద్, సంబంధిత శాఖల అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల సేవలకు ముస్లిం సోదరుల సంబరాలు

- మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం భారీ కేక్ కట్‌తో సంబరాలు
- 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి ప్రత్యేక అభినందనలు
- ఖబ్రస్తాన్, షాదీఖానా స్థలాల మంజూరును గుర్తుచేసుకున్న మైనారిటీ నాయకులు
- "అభివృద్ధి - అండదండల ప్రతీక తుమ్మల" అంటూ ప్రశంసలు
- దమ్మపేటలో ఉత్సాహంగా వేడుకలు



**దమ్మపేట, ఆర్గాన్ న్యూస్, మే 12:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ జీవితంలో 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దమ్మపేటలో ముస్లిం సోదరులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. మంత్రి తుమ్మల చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, భారీ కేక్ కట్ చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకులు మాట్లాడుతూ, 1999 సంవత్సరంలో దమ్మపేట ముస్లిం సోదరుల కోసం ఖబ్రస్తాన్ (స్మశానవాటిక) స్థలం, షాదీఖానా స్థలం మంజూరు చేయించడమే కాకుండా షాదీఖానా నిర్మాణానికి కూడా సహకారం అందించిన నాయకుడు తుమ్మల నాగేశ్వరరావు అని కొనియాడారు. మైనారిటీల అభ్యున్నతికి ఎల్లప్పుడూ అండగా నిలిచిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల పాటు ప్రజాసేవను ధ్యేయంగా తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేసిన తుమ్మల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి పనిచేసే నాయకత్వం అరుదని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కేవీ సత్యనారాయణ, మండల మైనారిటీ నాయకులు ఎండీ వాలిపాష్, షేక్ షబ్బీర్, మహమ్మద్ గౌస్, మొహమ్మద్ ఫయాజ్, షేక్ దస్తగీర్, మహమ్మద్ సాలార్, రహీం, గోరే తదితరులు పాల్గొన్నారు.




## హనుమాన్ జయంతి సందర్భంగా పలు దేవాలయాల్లో పూజలు
### పాల్గొన్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల దంపతులు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 12 :** హనుమాన్ జయంతి హనుమంతునికి ప్రీతిపాత్రమైన మంగళవారం రావటంతో మంగళవారం పలు దేవాలయాల్లో జరిగిన పూజల్లో రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, ఆయన సతీమణి 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పాల్గొని పూజలు చేశారు. పాల్వంచ పట్టణ పరిధి పాత పాల్వంచలోని ఆంజనేయస్వామి దేవాలయంలో, బొల్లోరిగూడెంలోని రామాలయంలో, అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంగణంలోని హనుమాన్ గుడిలో జరిగిన ప్రత్యేక పూజల్లో కొత్వాల దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయ నిర్వాహకులు కొత్వాల దంపతులను శాలువాతో సత్కరించారు. అయ్యప్పస్వామి దేవాలయంలో భక్తులకు అన్నదానం ప్రారంభించిన కొత్వాల హనుమాన్ జయంతి సందర్భంగా సుమారు వెయ్యి మంది భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని కొత్వాల ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, సీరపు సుగుణ, అయ్యప్పస్వామి దేవాలయం పూజారి బృందావనం నరసింహమూర్తి, కనగాల రాంబాబు, బేతంశెట్టి వెంకట్, భట్టు మంజుల, బ్యాంకు చారీ, కేశబోయిన కోటేశ్వరరావు, బాడిశ శంకరరావు, గల్ల శోభన్ బాబు, హర్షవర్ధన్, సుంకర వీరభద్రం, కృష్ణ, ప్రసాద్, బూసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

40 వసంతాల తుమ్మల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు దాటిన ఆ రాజకీయ యోధునితో కలిసి ఆర్గాన్ కూడా ప్రయాణం చేసిందని ప్రజలకు గుర్తు సేసేందుకై మా ఈ ప్రయత్నం..

# “బయ్యారం భూకంపం”

## ఆర్గాన్ అక్షరాయుధం



- తుమ్మల గర్జనతో కూలిన ఖనిజ సామ్రాజ్యం
- ఉమ్మడి రాష్ట్రాన్ని కుదిపేసిన బయ్యారం ఇనుప ఖనిజ కుంభకోణం
- అసెంబ్లీలో ఆర్గాన్ కథనాలను ఆయుధంగా మలిచిన తుమ్మల నాగేశ్వరరావు
- వేల కోట్ల ప్రజా సంపద దోపిడీపై రోశయ్య సర్కార్ విచారణకు ఆదేశాలు
- మీడియా--ప్రజానాయకత్వం కలిస్తే చరిత్ర మారుతుందనే అరుదైన ఉదాహరణ
- ఆర్గాన్ ఎడిటర్ రవికుమార్ దండ్యాల ప్రత్యేక కథనం




“ఆయనతో నేను ఎన్నడూ ఫోటో దిగలేదు... సెల్ఫీ తీసుకోలేదు... ఎదురెదురుగా కూర్చొని మాట్లాడలేదు... కనీసం షేక్‌హ్యాండ్ కూడా ఇవ్వలేదు... అయినా మా మధ్య ఉన్న అనుబంధం రెండు రాష్ట్రాల గమనాన్నే మార్చింది...” --- ఈ భావోద్వేగ వాక్యాల వెనుక ఒక పత్రిక ధైర్యం, ఒక ప్రజానాయకుడి రాజకీయ పోరాటం, ఒక రాష్ట్రాన్ని కుదిపేసిన ఖనిజ కుంభకోణం, ప్రజాసంపద కోసం సాగిన యుద్ధ చరిత్ర దాగి ఉంది. 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను వణికించిన “బయ్యారం ఇనుప ఖనిజ కుంభకోణం” వెనుక నిలిచింది ఒక ప్రాంతీయ పత్రిక చేసిన వరుస సంచలన కథనాలు... వాటిని అసెంబ్లీలో అక్షరాయుధాలుగా మలిచిన అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు ధీటైన పోరాటం... చివరకు ప్రభుత్వం తీసుకున్న సంచలన నిర్ణయం.

అది రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కల్లోల సమయం. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆకస్మిక మరణంతో కాంగ్రెస్ ప్రభుత్వం అనిశ్చితిలో పడింది. కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వేళ తెలంగాణ ఉద్యమం మంటలు రగులుతుండగా, మరోవైపు అవినీతి ఆరోపణలు రాష్ట్రాన్ని కుదిపేస్తున్నాయి. అలాంటి సమయంలో ఖమ్మం జిల్లా బయ్యారం అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న భారీ ఇనుప ఖనిజ అక్రమ తవ్వకాలపై “ఆర్గాన్” పత్రిక వరుస ఫ్రంట్‌పేజ్ కథనాలు ప్రచురించడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు రేపింది.







అధికారికంగా కేవలం పన్నెండున్నర హెక్టార్ల లీజుకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ, భారీ ప్రొక్లైన్లతో రాత్రింబవళ్లు తవ్వకాలు సాగుతున్నాయని ఆర్గాన్ బట్టబయలు చేసింది. రోజుకు 20 నుంచి 30 లారీల ద్వారా సుమారు వెయ్యి టన్నుల ఇనుప ఖనిజం ప్రతి రోజు తరలింపవుతోందని కథనాలు వెల్లడించాయి. పగటి వేళల్లో అనుమతులు ఉన్న ప్రాంతాల్లో అధికారిక లోడింగ్ జరుగుతుండగా, రాత్రివేళల్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది ట్రాక్టర్లు అక్రమ ప్రాంతాల్లో తవ్విన ఖనిజాన్ని అనుమతులున్న ప్రాంతాల్లో డంప్ చేసి వెళ్లిపోతున్నాయని సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. తెల్లవారిన తరువాత ప్రజల కళ్లముందే ఆ ఖనిజాన్ని అధికారిక వే-బిల్లులు, మైనింగ్ పర్మిషన్లతో లారీల్లో ఎక్కించి తరలిస్తున్నారని కథనాలు పేర్కొన్నాయి. “ఎన్ని వేల వే-బిల్లులు ముద్రించబడ్డాయి? ఎన్ని వేల టన్నుల ఖనిజం తరలించబడింది? ఎన్ని కోట్ల ప్రజా సంపద దోచుకుపోయారు?” అనే ప్రశ్నలు అప్పట్లో రాష్ట్రాన్ని కుదిపేశాయి.

ఈ కథనాలన్నింటినీ చేతిలో పట్టుకుని అప్పటి ఖమ్మం జిల్లా ప్రతిపక్ష ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీశారు. రోజుకో ఆధారం... రోజుకో కథనం... రోజుకో ఆరోపణతో సభను కుదిపేసిన తుమ్మల వైఖరి అప్పట్లో సంచలనమైంది. ఇదే సమయంలో ప్రస్తుత కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన కీలక పత్రాలను సభలో ప్రవేశపెట్టడంతో బయ్యారం వ్యవహారం జాతీయస్థాయిలో చర్చకు దారితీసింది. పరిస్థితి తీవ్రతను గ్రహించిన ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సభలోనే విచారణకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం బయ్యారం ఇనుప ఖనిజ లీజులు రద్దు చేయబడ్డాయి. ఆ నిర్ణయం అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి దిద్దుబాటు చర్యగా నిలిచింది.

“ఆర్గాన్ కథనాలు లేకపోయి ఉంటే... తుమ్మల అసెంబ్లీలో ఆ కథనాలను ఆధారాలుగా చూపిస్తూ పోరాడకపోయి ఉంటే... బయ్యారం దోపిడీకి ముగింపు వచ్చేది కాదు” అని ఆ కాలాన్ని గుర్తు చేసుకుంటున్న రాజకీయ విశ్లేషకులు ఇప్పటికీ వ్యాఖ్యానిస్తున్నారు. ఆ సమయంలో ప్రధాన మీడియా ఒత్తిళ్లు, అధికార వర్గాల అండ, మావోయిస్టుల ప్రభావం, అక్రమ మైనింగ్ మాఫియాల బెదిరింపుల మధ్య కూడా “ఆర్గాన్” వెనుకడుగు వేయలేదు. ఫ్రంట్‌పేజీల్లో వరుస కథనాలతో ఖనిజ దోపిడీ సామ్రాజ్యాన్ని సవాల్ చేసింది. అటు గన్నులు పట్టిన అన్నల నుంచి... ఇటు పెన్నులు పట్టిన వర్గాల నుంచి... చివరకు రక్షక భటుల బెదిరింపుల వరకూ వచ్చిన ఒత్తిడులను లెక్కచేయకుండా పత్రిక ముందుకు సాగింది. ఆర్గాన్ వెనుక ఉన్నది కేవలం జర్నలిజం కాదు... “పరిశ్రమలు రావాలి... పది మందికి ఉపాధి కలగాలి...” అనే ఆలోచనతో తపించిన ఎంటర్‌ప్రెన్యూర్ రక్తమని ఎడిటర్ పేర్కొన్నారు. ఆ సంకల్పబలం ముందు రాజకీయ మైకులు, గన్నులు, అధికార హెచ్చరికలు పనిచేయలేకపోయాయని అందరికీ అవగతమయ్యింది

“ఆర్గాన్ కథనాలు లేకపోయి ఉంటే... తుమ్మల అసెంబ్లీలో ఆ కథనాలను ఆధారాలుగా చూపిస్తూ పోరాడకపోయి ఉంటే... బయ్యారం దోపిడీకి ముగింపు వచ్చేది కాదు” అని ఆ కాలాన్ని గుర్తు చేసుకుంటున్న రాజకీయ విశ్లేషకులు ఇప్పటికీ వ్యాఖ్యానిస్తున్నారు. ఆ సమయంలో ప్రధాన మీడియా ఒత్తిళ్లు, అధికార వర్గాల అండ, మావోయిస్టుల ప్రభావం, అక్రమ మైనింగ్ మాఫియాల బెదిరింపుల మధ్య కూడా “ఆర్గాన్” వెనుకడుగు వేయలేదు. ఫ్రంట్‌పేజీల్లో వరుస కథనాలతో ఖనిజ దోపిడీ సామ్రాజ్యాన్ని సవాల్ చేసింది. అటు గన్నులు పట్టిన అన్నల నుంచి... ఇటు పెన్నులు పట్టిన వర్గాల నుంచి... చివరకు రక్షక భటుల బెదిరింపుల వరకూ వచ్చిన ఒత్తిడులను లెక్కచేయకుండా పత్రిక ముందుకు సాగింది. ఆర్గాన్ వెనుక ఉన్నది కేవలం జర్నలిజం కాదు... “పరిశ్రమలు రావాలి... పది మందికి ఉపాధి కలగాలి...” అనే ఆలోచనతో తపించిన ఎంటర్‌ప్రెన్యూర్ రక్తమని ఎడిటర్ పేర్కొన్నారు. ఆ సంకల్పబలం ముందు రాజకీయ మైకులు, గన్నులు, అధికార హెచ్చరికలు పనిచేయలేకపోయాయని అందరికీ అవగతమయ్యింది



రాష్ట్ర విభజన తరువాత తెలంగాణ ఏర్పడింది. రాజకీయ పరిస్థితులు మారాయి. పత్రికా స్వేచ్ఛపై ప్రశ్నలు తలెత్తిన కాలాలు గడిచాయి. అయితే పదేళ్ల తరువాత కొత్త తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, బయ్యారం ఖనిజ కుంభకోణాన్ని భగ్గుమనిపించిన తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ప్రజల్లో మరోసారి ఆశలు చిగురించాయి. “తుమ్మల తలుచుకుంటే బయ్యారం లక్ష మందికి ఉపాధి కలిగించే కేంద్రంగా మారుతుంది” అనే విశ్వాసం ప్రజల్లో వినిపిస్తోంది. ఆ దిశగా మళ్లీ ఆర్గాన్‌లాంటి ధైర్యవంతమైన స్వరాలు యాక్టివ్ కావాలని స్థానిక వర్గాలు ఆశిస్తున్నాయి.

70 ఏళ్ల వయసులో కూడా రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసి ప్రజల మధ్య తిరిగిన చంద్రబాబును నడిపించిన రాజకీయ శక్తుల్లో తుమ్మల మెదటివారని.. “ఆ చంద్రుడి ప్రతి అడుగులో ఖమ్మం ఆర్గాన్ కథనాల ప్రభావం ఉమ్మడి రాష్ట్ర ప్రజల్లో భలంగా ఉన్నది. బయ్యారం ఇనుప ఖనిజ కుంభకోణాన్ని భగ్నం చేసిన రాజకీయ బాహుబలిగా తుమ్మల నాగేశ్వరరావు పేరు నిలిచిపోగా... ఆ పోరాటానికి అక్షరాయుధంగా నిలిచింది “ఆర్గాన్” పత్రిక అనే అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది

ఒక ప్రజానాయకుడు... ఒక ప్రాంతీయ పత్రిక... ప్రజాసంపద కోసం కలిసినప్పుడు చరిత్ర ఎలా మారుతుందో నిరూపించిన అరుదైన ఘటనగా “బయ్యారం భూ-కంపం” ఇప్పటికీ రాజకీయ చరిత్రలో చెరగని అధ్యాయంగా నిలిచిపోయింది.

40 వసంతాల తుమ్మల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు దాటిన ఆ రాజకీయ యోధునితో కలిసి ఆర్గాన్ కూడా ప్రయాణం చేసిందని ప్రజలకు గుర్తు సేసేందుకై మా ఈ ప్రయత్నం..

# "చంద్రుడి పాదయాత్ర"కు
# బీజం ఖమ్మంలోనే...

## తుమ్మల.. ఆర్గాన్ ఆలోచనే టీడీపీకి జీవరేఖ!



- పార్టీ ఉనికి సంక్షోభంలో ఉన్న వేళ 'పాదయాత్ర' అస్త్రాన్ని ప్రతిపాదించిన ఆర్గాన్ కథనం
- తుమ్మల మేధోమథనం -- ఎడిటోరియల్ వ్యూహం కలిసి రాజకీయ చరిత్రను మలిచిన ఘట్టం
- ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీని నిలబెట్టిన చంద్రబాబు యాత్రకు ఖమ్మం నుంచే దిక్సూచి
- ఆర్గాన్ ఫ్రంట్‌పేజ్ కథనం... రెండు రాష్ట్రాల రాజకీయ గమనాన్ని ప్రభావితం చేసిన అరుదైన పరిణామం
- ఇప్పటికీ తుమ్మలపై టీడీపీ శ్రేణుల్లో కృతజ్ఞత -- ప్రజల్లో కొత్త రాజకీయ ఆశలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో తెలుగుదేశం పార్టీ అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొన్న కాలం అది.. కాంగ్రెస్ పార్టీలో వరుసగా ముగ్గురు ముఖ్యమంత్రులు మారిపోవడం... వైఎస్ మరణానంతరం జగన్ తన స్వంత పార్టీతో రాష్ట్రవ్యాప్తంగా శక్తి ప్రదర్శన ప్రారంభించడం... అధికార, ఆర్థిక, భావోద్వేగ ప్రభావాలతో టీడీపీ నేతలను, కార్యకర్తలను భారీగా ఆకర్షించే ప్రయత్నాలు జరగడం... మరోవైపు "మాజీ ముఖ్యమంత్రి" అనే గుర్తింపుతో చంద్రబాబుపై రాజకీయ ఒత్తిడి పెరగడం... ఈ పరిణామాలన్నీ కలిసి తెలుగుదేశం పార్టీని ఉమ్మడి రాష్ట్రంలోనే ఉనికి సంక్షోభంలోకి నెట్టాయి.

ప్రత్యేకంగా కీలక జిల్లాల్లో పార్టీ బలహీనపడుతోందనే ఆందోళన తీవ్రంగా పెరిగింది. అటువంటి ప్రమాద సంకేతాలను ముందుగానే పసిగట్టిన ఖమ్మం జిల్లా రాజకీయ దురంధరుడు తుమ్మల నాగేశ్వరరావు, ప్రజల మధ్యకు వెళ్లకుండా పార్టీ నిలబడదని స్పష్టంగా గుర్తించారు. అదే సమయంలో ఖమ్మం నుంచి వెలువడుతున్న "ఆర్గాన్" దినపత్రిక ఎడిటోరియల్ బృందంతో కలిసి ఒక రాజకీయ దిశానిర్దేశక ఆలోచనకు రూపకల్పన చేశారు.





### అలా పుట్టుకొచ్చిందే ... "చంద్రుడి పాదయాత్ర".

ఆర్గాన్ ఫ్రంట్‌పేజ్‌లో వెలువడిన ఆ కథనం అప్పట్లో టీడీపీ వర్గాల్లో పెను చర్చకు దారితీసింది. "ప్రజల మధ్యకు వెళ్లాలి... రైతుల బాధలు తెలుసుకోవాలి... గ్రామీణ సంక్షోభాన్ని ప్రత్యక్షంగా చూడాలి... పార్టీ కార్యకర్తలకు మళ్లీ నమ్మకం కల్పించాలి..." అనే సందేశాన్ని ఆ కథనం బలంగా వినిపించింది. అది కేవలం జర్నలిస్టిక్ వ్యాసం మాత్రమే కాదు... పార్టీ పునర్నిర్మాణానికి రూపొందించిన రాజకీయ బ్లూప్రింట్‌గా మారింది. ఆ కథనాన్ని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరోలో చర్చకు తీసుకెళ్లినట్లు అప్పటి రాజకీయ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటై, తుమ్మల సూచనలు, అనుభవాలు, వ్యూహాలు ఆధారంగా పాదయాత్రకు రూపరేఖలు సిద్ధమైనట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా నాయకుల అభిప్రాయాలు సేకరించి, పార్టీ శక్తి యుక్తులను సమీకరించి చివరకు చంద్రబాబు నాయుడు చారిత్రాత్మక పాదయాత్రకు శ్రీకారం చుట్టారు.




- అవినీతిపై సమరానికి సన్నద్ధం
- రాందేవ్ బాబా, హజారేకూ పిలుపు
- కేడర్‌లో ఉత్తేజానికై కసరత్తు
- మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం
- వైఎస్‌ఆర్‌సీ వైపు వలసల నిరోధానికి ప్రణాళిక
- నందమూరి కుటుంబం మొత్తం పాల్గొనేలా ప్రయత్నాలు
- ప్రజల్లో ఉంటేనే పట్టు నిలుపుకొంటామనే భావనలో టిడిపి శ్రేణులు
- కార్యాచరణపై త్వరలో వెల్లడి

ప్రజా సమస్యలపై పోరాడి ఎప్పటికప్పుడు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తుంటే తప్ప ప్రజలు మనల్ని గుర్తించేలా లేరని నాయకులకు అర్థమైపోయింది. ఒక్క టీడీపీకే కాదు రాష్ట్రంలోని అన్ని పార్టీల్లో, నాయకుల్లో జగన్ ఉప ఎన్నికల గెలుపుతో బలమైన ప్రణాళికా కసరత్తు మొదలైంది.. అదే పనిని మొదటగా కళ్లు తెరిచిన టీడీపీ అధినేత క్షేత్రస్థాయిలో మొదలు పెట్టనున్నారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడితే తప్ప ప్రభుత్వ వ్యతిరేకతను తీసుకు రాలేమని నేతలకు అర్థమైంది. అవినీతిపై సమరాన్ని ఉధృత రూపంలోకి తీసుకురావచ్చనే ప్రణాళికతో ప్రజల మధ్యకు రావాలనే వ్యూహంలో ఉన్నారు...



ఆ యాత్ర కేవలం రాజకీయ పర్యటన కాదు... సంక్షోభంలో ఉన్న పార్టీకి ప్రాణవాయువైంది. రైతుల కష్టాలు, గ్రామీణ సమస్యలు, పాలనా వైఫల్యాలు, ప్రజల అసంతృప్తిని నేరుగా ప్రజల మధ్య నిలబడి వినడం ద్వారా చంద్రబాబు మళ్లీ ప్రజల్లోకి చొచ్చుకుపోయారు. వేల కిలోమీటర్ల పాటు సాగిన ఆ యాత్ర ఉమ్మడి రాష్ట్ర రాజకీయ సమీకరణాలను మార్చేసింది. ఈలోగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంది. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడడం రాజకీయ చరిత్రలో కీలక మలుపుగా నిలిచాయి. అప్పటి రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం – ఒకవేళ ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీకి బదులు జగన్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే, తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు తీవ్ర సంక్షోభంలో పడే అవకాశాలు కనిపించాయి.

అలాంటి సమయంలో ఖమ్మం నుంచి వచ్చిన ఒక ఆలోచన... "ఆర్గాన్"లో వచ్చిన ఒక ఫ్రంట్‌పేజ్ కథనం... తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ దూరదృష్టి... చంద్రబాబు పాదయాత్రగా మారి రెండు రాష్ట్రాల్లో టీడీపీ రాజకీయ మనుగడకు దిక్సూచిగా నిలిచిందనే అభిప్రాయం ఇప్పటికీ పార్టీ శ్రేణుల్లో వినిపిస్తోంది.

"ఇది కేవలం రాజకీయ వ్యూహం కాదు... భవిష్యత్‌ను ముందుగానే అంచనా వేసిన దార్శనిక నాయకత్వం" అని అప్పట్లో తుమ్మలను టీడీపీ శ్రేణులు విపరీతంగా ప్రశంసించాయి. ఆ కృతజ్ఞత ఇప్పటికీ పార్టీ కార్యకర్తల్లో ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో కీలక మంత్రిగా ఉన్నప్పటికీ, ఖమ్మం జిల్లా ప్రజల్లో ఆయనపై ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు. "గతంలో పార్టీ భవిష్యత్తు కోసం తీసుకున్న నిర్ణయాల మాదిరిగానే... రాబోయే రోజుల్లో ప్రజల భవిష్యత్తు కోసం కూడా తుమ్మల పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకుంటారు" అనే ఆశాభావం జిల్లా ప్రజలలో బలంగా వ్యక్తమవుతోంది. ఆర్గాన్ పత్రిక కథనం... ఒక నాయకుడి దూరదృష్టి... ఒక పాదయాత్ర... చివరకు రెండు రాష్ట్రాల రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసిన అరుదైన అధ్యాయంగా ఒక పత్రిక కథనం... ఒక నాయకుడి దూరదృష్టి... ఒక పాదయాత్ర... చివరకు రెండు రాష్ట్రాల రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసిన అరుదైన అధ్యాయంగా "చంద్రుడి పాదయాత్ర" కథ ఇప్పుడు మళ్లీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం కాబోతుంది..ఎందుకంటే రానున్న రోజుల్లో మళ్ళీ ఆర్గాన్ – తుమ్మల కలిసి కొన్ని భారీ భవిష్య ప్రణాళికలు జిల్లా ప్రజలకోసం రచించారు జిల్లా ఉన్నన్నాళ్ళు గుర్తుండిపోయే ఈ బృహత్ ప్రణాళికల్లో దేశంలో తెలంగాణ నెంబర్ వన్ ఐతే తెలంగాణలో ఖమ్మం నెంబర్ వన్ కాబోతుంది..

– ఇది నిజంగా నిజం.. ఆర్గానిజం"

## టాపర్ల కలను నిజం చేసిన ఊటుకూరు ఫౌండేషన్

### పదో తరగతి టాపర్లకు ఉచిత విమాన ప్రయాణం కల్పింపు



**బోనకల్, ఆర్గాన్ న్యూస్ మే 12 :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించే దిశగా ఊటుకూరు ఫౌండేషన్ మరోసారి ఆదర్శంగా నిలిచింది. బోనకల్ మండలంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఉచిత విమాన ప్రయాణం కల్పిస్తామని పరీక్షలకు ముందే ప్రకటించిన ఫౌండేషన్, ఇచ్చిన హామీని మంగళవారం అమలు చేసింది. ఆళ్లపాడు పాఠశాలకు చెందిన భాను ప్రకాష్, రావినూతల పాఠశాలకు చెందిన చంద్రికలకు విజయవాడ నుంచి హైదరాబాద్ వరకు విమాన ప్రయాణాన్ని ఏర్పాటు చేశారు. తొలిసారి విమానంలో ప్రయాణించిన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించిన ఊటుకూరు ఫౌండేషన్ సభ్యులు ఊటుకూరు నాగేశ్వరరావుకు మండల విద్యాశాఖ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. విద్యార్థులతో పాటు మండల విద్యాశాఖ అధికారి దామల పుల్లయ్య ప్రయాణించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫౌండేషన్ సేవలను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



## హనుమాన్ జయంతి ఉత్సవాలు

**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, మే 12:** మంగపేట మండలం కమలాపురం గ్రామంలో శ్రీ ఆంజనేయ దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను కమలాపురం గ్రామానికి చెందిన కటికనేని ప్రఫుల్ రావు స్వామి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం సింధూర లేపనం హనుమత్ హోమం పూర్ణహుతిని ఘనంగా నిర్వహిచారు. అనంతరం ఆంజనేయస్వామి దీక్ష పరుల ఇరుముడి ధారణ కార్యక్రమం శ్రీ భక్తంజనేయ అర్చకులు ఈశ్వర్ చందుశర్మ 41 రోజు, 21, 11 రోజుల పాటు కఠోర దీక్షలను చేపట్టి వారికి అంజన్నస్వామి మాలధారులకు మంత్రోచ్ఛారణలతో ఇరుముడి కార్యక్రమాన్ని చేపట్టగా కుటుంబ సభ్యులు ఇరుముడి బియ్యం కట్నాలు సమర్పించారు. స్వాములు ఆలయం చూట్టు ప్రదీక్షణలు చేసి భద్రాచలం సీతారాముల దర్శనానికి బయలుదేరారు. అనంతరం కటికనేని ప్రఫుల్ రావు స్వామి నిర్వహించిన మహా అన్న దాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ అన్న ప్రసాద వితరణ లో సుమారు ఎనిమిది వందల మంది భక్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు లింగంపల్లి శ్రీనివాస్ రావు యాస నాగేందర్ రెడ్డి తాలూకా సంపత్ శ్రీ రాం అశోక్ లక్ష్మణ్ చందు తో పాటు 50 మంది స్వాములు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాకు రాష్ట్ర పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలి

### టీడీపీ ములుగు ఇంచార్జ్ దారావత్ దేవా నాయక్ డిమాండ్



**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, మే 12:** రాష్ట్ర ప్రభుత్వంలోని నామినేటెడ్ కార్పొరేషన్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల్లో ములుగు జిల్లాకు తగిన ప్రాధాన్యత కల్పించాలని టీడీపీ ములుగు నియోజకవర్గం ఇంచార్జ్ దారావత్ దేవా నాయక్ డిమాండ్ చేశారు. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఉన్న సమయంలో ములుగు నియోజకవర్గం నుంచి ఇద్దరు రాష్ట్ర చైర్మన్లు పనిచేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం మాత్రం ములుగు జిల్లాపై చిన్నచూపు ఎందుకు చూస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర స్థాయిలో ఇచ్చే నామినేటెడ్ పదవులు ములుగు జిల్లాకు రాకుండా కొంతమంది కావాలనే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాకు న్యాయం చేయకపోతే రానున్న రోజుల్లో ప్రజలు ఓట్ల రూపంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యంగా ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన నాయకులకు రాష్ట్ర కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని దేవా నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధి, రాజకీయ సమతుల్యత కోసం ములుగుకు సముచిత ప్రాధాన్యం అవసరమని పేర్కొన్నారు.

## బడంగ్ పేట డిగ్రీ కళాశాలలో "లక్ష్యా" కార్యక్రమం

**రంగారెడ్డి ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ మే 12:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాల సందర్భంగా" లక్ష్య" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పీజీ ప్రవేశ పరీక్షలపై అవగాహన ఉన్నత విద్యా అవకాశాలు కెరియర్ మార్గదర్శకత్వం వెల్నెస్ పై ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్స్ చలసాని ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజకుమార్ విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రామరాజు కార్యక్రమాన్ని నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ వెంకటరెడ్డి డాక్...

## నాలా పనులు పూర్తి చేయాలి

### మాజీ మంత్రి సబితా రెడ్డి

**రంగారెడ్డి ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ మే 12 :** వానాకాలం నాటికి ఎస్ ఎన్ డి పి నాలా పనులు పూర్తి చేయాలని మాజీ మంత్రి మహేశ్వరం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. బడంగ్ పేట సర్కిల్ పరిధిలోని జిల్లాలో కూడాను గతంలో చేపట్టిన పనులు అర్ధాంతరగా నిలిచిపోయాయని ఈ క్రమంలో సోమవారం బడంగ్ పేట డిసి సమ్మయ్య ఎస్ ఎన్ డి పి విభాగం అధికారులతో కలిసి నాలా పనులను ఆమె తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా సవిత రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వానాకాలంలో మిథిలా నగర్ సత్యసాయి నగర్ తదితర కాలనీలో వరద ముంపునకు అవుతున్నాయని ఆ ఇబ్బందులు దూరం చేయడానికి అప్పటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఎస్ ఎన్ఎన్ డిపి నాలా ప్రాజెక్టును చేపట్టిందని అన్నారు ప్రస్తుత ప్రభుత్వం పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తాను మళ్ళీ నిధులు మంజూరు చేయించి పనులు పునః ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకున్నానని ఆమె చెప్పారు వర్షాలు కురవకముందే నాలా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆమె అధికారులను కాంట్రాక్టర్కు సూచించారు ఈ కార్యక్రమంలో మీర్పేట కౌన్సిల్ భారత రాష్ట్ర సమితి మాజీ ఫ్లోర్ లీడర్ భూపాల్ రెడ్డి మాజీ కార్పొరేటర్ అనిల్ కుమార్ యాదవ్ గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ మాధవి వెంకటేశ్వరరావు నాయకులు కామేష్ రెడ్డి దుర్గా దీప్లాల్ రమేష్ విజయ్ భూపేష్ గౌడ్ లక్ష్మణ్ ముదిరాజ్ గోపి యాదవ్ సునీత బాలరాజు లతా శేఖర్ విందు నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ శక్తితో ఆదా..

- పచ్చునూరులో అభివృద్ధి దిశగా మరో ముందడుగు
- సోలార్ వినియోగంతో ప్రజలకు ఆర్థిక లాభాలు
- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ




**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, మే 12:** పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ ఖర్చులను తగ్గించే దిశగా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రతి కుటుంబం అలవాటు చేసుకోవాలని మానకొండూరు ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలం, పచ్చునూరు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీఎస్ఆర్ఈడీసీఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన సోలార్ అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ ప్రజలకు సోలార్ విద్యుత్ వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ సబ్సిడీలు, భవిష్యత్‌లో విద్యుత్ ఆదా అవకాశాలపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం సాధారణ కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఇంటి డాబాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే ప్రతి నెలా 360 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లభించే అవకాశం ఉందని తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి కుటుంబాలు ఆదాయం కూడా పొందవచ్చని చెప్పారు. సాంప్రదాయ విద్యుత్ వినియోగంపై ఆధారపడకుండా పునరుత్పాదక ఇంధన వనరుల వైపు ప్రజలు అడుగులు వేయాల్సిన సమయం వచ్చిందని ఆయన అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడంలో సోలార్ శక్తి కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ వినియోగం పెరిగితే విద్యుత్ కొరత సమస్యలు కూడా తగ్గే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. అనంతరం పచ్చునూరు గ్రామంలో నిర్మించనున్న వీవో భవనానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. మహిళా సంఘాల సమావేశాలు, స్వయం సహాయక కార్యక్రమాలు, గ్రామస్థాయి అభివృద్ధి చర్యలకు ఈ భవనం కేంద్రంగా మారుతుందని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ మహిళల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్ఈడీసీఓ అధికారులు, మండల తహసీల్దార్ వివి వరలక్ష్మి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు రొంటాల లక్ష్మారెడ్డి, కనకం అశోక్, రేమిడి శ్రీనివాసరెడ్డి, ముద్దసాని శ్రీనివాసరెడ్డి, తాళ్లపల్లి సంపత్ గౌడ్, బండి మల్లేష్, రేమిడి తిరుపతి, సాయిరి దేవయ్య, కోండ్ర సురేష్, కనకం కుమార్, బుర్ర శ్రీధర్, వేగోళం శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం అరికట్టాలి

**ఈ నెల 30న కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి రైతు మహాగర్జన**


**కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఆహ్వానించిన రైతు ప్రజా సంఘాల జేఏసీ నాయకులు**




**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మే 12:** రాష్ట్రంలో వరి, మొక్కజొన్న దాన్యం కొనుగోళ్లు మరియు తరలింపు ప్రక్రియలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని రైతు ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా ఈ నెల 30న కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి "రైతు మహాగర్జన సమరభేరి సభ"ను భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సభకు మద్దతు కోరుతూ మంగళవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నివాసంలో రైతు ప్రజా సంఘాల నాయకులతో కలిసి పోలాడి రామారావు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. సభకు సానుకూలంగా స్పందించిన బండి సంజయ్, రైతు మహాగర్జనకు మద్దతు ప్రకటించడంతో పాటు పోలాడి రామారావుతో కలిసి సభ గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలాడి రామారావు మాట్లాడుతూ, రైతులకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పంటల కొనుగోళ్లు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా నేటికీ నత్తనడకన కొనసాగుతున్నాయని విమర్శించారు. మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌ను రైతులు అడిగితే వివిధ కారణాలు చూపిస్తూ జాప్యం చేస్తున్నారని అన్నారు. కొనుగోళ్ల వ్యవస్థలో కమిషన్ల కోసమే పాలకులు ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన ఆయన, కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలు పరిష్కరించాల్సిన కింది స్థాయి అధికారులే మామూళ్ల కోసం రైతులను నిలువు దోపిడీకి గురి చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై తేమ, తాలు పేరుతో క్వింటాల్‌కు 5 నుంచి 8 కిలోల వరకు కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఏ గ్రేడ్ దాన్యాన్ని కామన్ గ్రేడ్ కింద మిల్లర్లు దిగుమతి చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయన ప్రశ్నించారు. దాన్యం ఎండబెట్టే క్రమంలో మండే ఎండలకు తాళలేక రైతులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు కలచివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలు, హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మిల్లుల వద్ద దాన్యం దిగుమతిలో ఆలస్యం చేయరాదని డిమాండ్ చేశారు. అన్ని రకాల పంటలకు ప్రకటించిన రూ.500 బోనస్‌ను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రైతు భరోసా నిధుల విడుదలలో కూడా ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. యాసంగి ప్రారంభంలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయాన్ని పంట సీజన్ ముగిసినా రైతుల ఖాతాల్లో పూర్తిగా జమ చేయకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఈ నెల 30న కరీంనగర్‌లో రెండు లక్షల మందితో రాష్ట్ర స్థాయి రైతు మహాగర్జన సమరభేరి సభ నిర్వహించనున్నామని, రైతులు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పోలాడి రామారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోతె గంగారెడ్డి, మెరుగు సంపత్, ఎర్రబెల్లి సంపత్ రావు, పంజాల శ్రీనివాస్, రంగు భాస్కరాచారి, కేశవరెడ్డి, గౌతం రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు భరోసా : ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి
- శంకరపట్నంలో కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, మే 12:** రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం, పేద ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రజా సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 73 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు, 51 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి మాట్లాడిన ఆయన, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందిస్తోందని, అలాగే పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 25 విడతల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని, 25వ విడతలో భాగంగా శంకరపట్నం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 51 మందికి రూ.13 లక్షల 48 వేల విలువైన చెక్కులను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సురేఖ, ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, డీసీసీ కార్యదర్శి గట్టు తిరుపతి, మండల సర్పంచ్ ఫోరం చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఉపసర్పంచుల ఫోరం చైర్మన్ గొట్టె మధు, సర్పంచులు చింతిరెడ్డి పద్మ, రాజేంద్రప్రసాద్, వినోద్, దుర్గం సుజాత-తిరుపతి, పార్టీ నాయకులు మొలంగూరు సదానందం, ఏ రమేష్, ఖాజా, మధుకర్, జనగాం రాజయ్య, ఆడెపు అజయ్, షారుక్, పవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ములుగు సాంస్కృతిక వైభవం

- ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, మే 12:** ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మూడు రోజుల పాటు ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నాయని జిల్లా కలెక్టర్ బోర్ఢే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఢే హేమంత్ సహదేవ రావు ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఉత్సవాల షెడ్యూల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏర్పాట్లపై దిశాని ర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విశిష్ట సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాల జడ్.పి.హెచ్.ఎస్. బాలికల పాఠశాలలో మే 20,21,22వ తేదీలలో మూడు రోజులపాటు క్రీడలు సంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్ స్టాల్స్, గిరిజన నృత్యాలు కవి సమ్మేళనం పలు అంశాలలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు నిర్వహించే వేదికలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చూడాలని తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి అంశాలలో ఎలాంటి లోటుపాట్లు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి సంపత్ రావు ఆర్డీవో వెంకటేష్ జిల్లా అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బెజ్జంకి కూరగాయల మార్కెట్ నిరుపయోగం

- లక్షలు ఖర్చు చేసినా షెడ్డు ఖాళీగానే..!
- అధికారుల నిర్లక్ష్యంపై డీపీవోకు ఫిర్యాదు

**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, మే 12:** సిద్దిపేట జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, బెజ్జంకి మండల కేంద్రంలో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు కూరగాయల సంతను మార్కెట్ షెడ్డు కింద నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటికీ రహదారులపైనే సంత కొనసాగుతుండటంతో ప్రజలు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించే సమయంలో నిర్మించిన రేకుల షెడ్డు కిందే మార్కెట్ నిర్వహిస్తామని అధికారులు, పాలకులు హామీ ఇచ్చినప్పటికీ ఆ అమలు జరగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం గుండారం వెళ్లే ప్రధాన రహదారిపై, అలాగే వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే ట్రాక్టర్లు, భారీ వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగే విధంగా సంత కొనసాగుతోందని పేర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, "నిమ్మకు నీరెత్తినట్లు" వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ధనం వెచ్చించి నిర్మించిన మార్కెట్ వినియోగంలోకి రాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత మండల అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా పంచాయతీ అధికారి ఎ రవీందర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే మార్కెట్‌ను షెడ్డు కిందకు తరలించి ప్రజలకు, వ్యాపారులకు సౌకర్యాలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## గుంతల రోడ్లు ప్రయాణపుపాట్లు

- తాత్కాలిక మరమ్మతతో సరిపెడుతున్న అధికారులు
- నాగోల్ ఓఆర్ ఆర్ పై పెరుగుతున్న ప్రమాదాలు



**రంగారెడ్డి ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ మే 12 :** నాగోల్ నుండి ఓ ఆర్ ఆర్ వైపు వెళ్లే ప్రధాన రహదారులు గోతులతో దెబ్బతిని వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. రహదారులపై ఏర్పడిన లోతైన గుంతలలో డ్రైనేజీ నీరు నిలువ ఉండడంతో అవి కనిపించకపోవడంతో ప్రతిరోజు ప్రమాదాలకు కారణం అవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శిస్తున్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడ చౌరస్తా నుండి ఆనంద నగర్ వైపుకు వెళ్లే రహదారిలో అనేక చోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి ఇటీవల అడపా దడపాక కురుస్తున్న వర్షాలు డ్రైనేజీ నీటి గుంతలలో నిలువ ఉండడంతో రాత్రివేళ గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాద బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గోతులు కనిపించక బైక్ల పైనుంచి కింద పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు అంటున్నారు అత్యవసర సేవలపై వెళుతున్న అంబులెన్స్ సైతం ఈ రహదారిపై నెమ్మదిగా వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడిందని కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని అధికారులు తాత్కాలిక మరమ్మత్తులతోనే సరిపెడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని రోజులు గడప ముందే రహదారులు మళ్ళీ దెబ్బ తింటూ ఉండడంతో నాణ్యత పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు కోట్ల రూపాయల ఖర్చు చేసి నిర్మిస్తున్న రహదారులు డ్రైనేజీ నేటికీ ధ్వంసం అవుతూ ఉండడంతో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని దివ్యాంగుల కాలనీ చౌరస్తాలో వరద నీటి కాలువపై ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. ఇక్కడ కాల్వ పై ఏర్పాటు చేసిన గ్రిల్స్ మధ్యభాగంలో రోడ్డు కృంగిపోవడంతో భారీ గోతిగా మారిందని స్థానికులు చెబుతున్నారు ప్రమాదవశాత్తు ఎవరైనా అందులో పడితే నేరుగా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అధికారులకు ఫిర్యాదులు చేసిన స్పందన లేదని జయపూర్ కాలనీ వాసులు మండిపడుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకొని రహదారులను శాశ్వతంగా మరమ్మత్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు నాగోల్ ఓఆర్ఆర్ ప్రధాన రహదారిపై వెంటనే నాణ్యమైన మరమ్మత్తు పనులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.






# ధరల నియంత్రణలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం

- సిపిఎం డివిజన్ కార్యదర్శి బండి రమేష్ విమర్శలు
- పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో సామాన్యులపై భారమన్న సిపిఎం
- "కార్పొరేట్ శక్తులకు కేంద్రం కొమ్ముకాస్తోంది" అంటూ ఆగ్రహం
- బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్న షేక్ బషీరుద్దీన్
- తిరుమలాయపాలెంలో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో విమర్శల వెల్లువ

**తిరుమలాయపాలెం, మే 12 (ఆర్గాన్ న్యూస్):** ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం డివిజన్ కార్యదర్శి బండి రమేష్ తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక గజ్జల వెంకటయ్య భవనంలో సిపిఎం మండల నాయకులు అంగిరేకుల నరసయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలపై తీవ్రమైన భారం పడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రించడంలో విఫలమైందని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఇంధన ధరలు పెంచడం ప్రజలపై మోపిన అదనపు భారమని పేర్కొన్నారు. ప్రజా పాలన అంటూ చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం కూడా ధరల నియంత్రణలో పూర్తిగా ఫెయిల్ అయిందని విమర్శించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ, మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, నేరస్తులపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, దాసరి మహేందర్, బింగి రమేష్, వర్షపొంగు వీరన్న, కొలిచలం స్వామి, సైదులు, కొత్తపల్లి వెంకన్న, నెరుసుల వెంకటేశ్వర్లు, కొత్తపల్లి దామోదర్ రెడ్డి, పుట్టల గురువులు ఉపేందర్, బోడ బాలు, కొమ్ము నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా కాళీ దుర్గామాత ఆలయ వార్షికోత్సవ వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- ప్రత్యేక పూజలు, దుర్గాహోమం, అన్నప్రసాద కార్యక్రమాలు

**సికింద్రాబాద్ :** అన్నా నగర్, బాలంరాయి చౌరస్తాలోని ఎంఈఎస్ క్వార్టర్స్ సాపర్స్ లైన్‌లో ఉన్న శ్రీ కాళీ దుర్గాదేవి ఆలయంలో 24వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచి అభిషేకం, గణపతి పూజ, కుమ్కుమార్చన, దుర్గాహోమం, మహా హారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదం పంపిణీ చేసి, మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకుడు కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# తాడు బంధు దేవాలయంలో మంత్రి కొండా సురేఖ ప్రత్యేక పూజలు

**సికింద్రాబాద్ :** హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబా ద్‌లోని తాడు బంధు దేవస్థానంలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి రాక సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి నరేందర్, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామివారికి వస్త్రాలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ హనుమాన్ జన్మోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తాడు బంధు దేవాలయం నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రాచీన ఆలయమని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దాతలు ముందుకు వస్తే అన్ని విధాలా సహకరిస్తామని పేర్కొన్నారు. శనిపీడలతో బాధపడే భక్తులు ఈ ఆలయాన్ని దర్శిస్తే స్వామివారి అనుగ్రహంతో సమస్యలు తొలగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్జేసీ రామకృష్ణ రావు, ఆలయ అధికారులు సురేష్, జూనియర్ అసిస్టెంట్ జయవర్ధన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ ఆనంద్ కుమార్, ఎస్ఐ నందిత తదితరులు పాల్గొన్నారు. అయితే మంత్రి కొండా సురేఖ ఆలయానికి సుమారు రెండు గంటలు ఆలస్యంగా రావడంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రి రాక కోసం భక్తులను నిలిపివేయడంతో ఆలయంలో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# మున్నూరు కాపుల ఆత్మగౌరవంపై దాడులు సహించం

- బండి సంజయ్‌పై జరుగుతున్న దుష్ప్రచారం వెనుక రాజకీయ కుట్ర
- ఐక్యంగా తిప్పికొడతామని మున్నూరు కాపు సంఘం నాయకులు



**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మే 12:** తెలంగాణలో బీసీ వర్గాల రాజకీయ ఎదుగుదలను అడ్డుకునేందుకు పన్నిన కుట్రల్లో భాగంగానే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై దుష్ప్రచారం జరుగుతోందని జిల్లా మున్నూరు కాపు సంఘం నేతలు ఆరోపించారు. మున్నూరు కాపుల సామాజిక, రాజకీయ బలాన్ని తగ్గించి చూపే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. కరీంనగర్ నగరంలోని నక్షత్ర హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ పటేల్, ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్ పటేల్, నేత బొమ్మరాతి రామచంద్రం పటేల్ మాట్లాడారు.

## బీసీ నాయకత్వంపై లక్ష్యబద్ధ దాడులు

తెలంగాణ రాజకీయాల్లో బీసీ వర్గాలకు చెందిన నాయకులు ప్రభావవంతంగా ఎదుగుతుండటాన్ని కొందరు శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయని నేతలు విమర్శించారు. సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించిన బండి సంజయ్, క్రమంగా కార్పొరేటర్, ఎంపీ, ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఎదగడం బీసీ సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిని రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత అంశాలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ బద్నాం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి పర్యటనకు ముందు పాత అంశాలను మళ్లీ తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ కుతంత్రం దాగి ఉందని అన్నారు.

## "వ్యక్తిత్వ హననం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం"

చట్టం ముందు అందరూ సమానమేనని, ఎవరైనా తప్పు చేసి ఉంటే న్యాయవ్యవస్థ చర్యలు తీసుకుంటుందని నేతలు స్పష్టం చేశారు. కానీ విచారణ పూర్తికాకముందే సోషల్ మీడియా వేదికగా ఒక నాయకుడిని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. తన కుటుంబ సభ్యుల విషయంలోనూ చట్టపరమైన చర్యలకు తాను సిద్ధమని బండి సంజయ్ బహిరంగంగా ప్రకటించినప్పటికీ, కావాలనే ఆయన్ను రాజకీయంగా దెబ్బతీయడానికి ప్రయత్నించడం దురుద్దేశపూర్వక చర్య అని పేర్కొన్నారు.

## కులగణనలో మున్నూరు కాపులకు అన్యాయం

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కులగణనలో మున్నూరు కాపుల జనాభాను కేవలం 3.9 శాతంగా చూపడం పట్ల నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా గణాంకాలను చూపడం ద్వారా మున్నూరు కాపుల రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్ అవకాశాలను బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు మున్నూరు కాపుల సంఖ్య గణనీయంగా ఉన్నప్పటికీ, అధికారిక లెక్కల్లో తక్కువగా చూపించడం వెనుక కుట్ర ఉందని పేర్కొన్నారు.

## "మా ఐక్యతే మా బలం"

మున్నూరు కాపు సమాజం ఎప్పుడూ ఆత్మగౌరవాన్ని, కష్టపడే తత్వాన్ని నమ్ముకుంటుందని నేతలు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల నుంచి వచ్చిన నాయకులను అణగదొక్కే రాజకీయాలకు తాము భయపడబోమని హెచ్చరించారు. బండి సంజయ్‌పై జరుగుతున్న ప్రతి దాడిని మున్నూరు కాపు సమాజం ఐక్యంగా తిప్పికొడుతుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. "కార్యకర్త స్థాయి నుంచి కేంద్ర మంత్రిగా ఎదిగిన బండి సంజయ్ ప్రయాణం మాకు స్ఫూర్తి. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలకు దిగడం పిరికితనానికి నిదర్శనం" అని నేతలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తిరుమణి రాజేశం పటేల్, ఆకుల యాదయ్య పటేల్, అనురాసు కుమార్ పటేల్, బండి ప్రశాంత్ పటేల్, బొమ్మరాతి సాయికృష్ణ పటేల్, కళ్యాడపు నరేష్ పటేల్, మ్యాడం శివకాంత్ పటేల్, కర్నెబత్తుల వెంకటేశ్వర్లు పటేల్, నేతికుంట అనుప్ పటేల్, నరేందర్ పటేల్, అమర్ పటేల్ పాల్గొన్నారు.

# వడదెబ్బను తేలికగా తీసుకోవద్దు

## ఏఐజి బీట్ హిట్ అవగాహన సదస్సు



**అక్కినే పల్లి పురుషోత్తమరావు ఆర్గాన్ న్యూస్ మే 12.** చాలామంది హీట్ స్ట్రోక్ ( వడదెబ్బను) సాధారణ నీరసం డిహైడ్రేషన్ అనుకుంటారు. కానీ ఇది మెదడు గుండె కిడ్నీలపై వేగంగా ప్రభావం చూపించే అత్యవసర పరిస్థితి. ఈ నేపథ్యంలో సంకేతాలను ముందే గుర్తించి వెంటనే చికిత్స ప్రారంభించాలి లేదంటే ప్రాణాలకే ప్రమాదం అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలకు వడదెబ్బ హీట్ స్ట్రోక్ పై అవగాహన కల్పించేందుకు ఏది ఆసుపత్రి బీట్ ది హీట్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వైద్యులు అనేక సూచనలు చేశారు.

## చెమట పట్టకపోవడం ప్రమాద కరసంకేతం

జ్వరం వచ్చినప్పుడే శరీర ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థ పనిచేస్తుంది చెమట పట్టి శరీరం వెంటనే చల్లబడుతుంది హీట్ స్ట్రోక్ లో ఆ వ్యవస్థ పూర్తిగా విఫలం అవుతుంది ఎండలో ఉన్న సరే చెమట పట్టదు. ఇది అత్యంత ప్రమాదకర సంకేతం. తొలత అలసట తల తిరగడం వికారం ఉంటుంది తర్వాత గందరగోళం మాట చదవడం ఫిట్స్ లక్షణాలు కనిపిస్తాయి నిర్లక్ష్యం చేయకుండా రోగిని వెంటనే ఆసుపత్రికి తరలించి వేడి వాతావరణం లో ఉన్నప్పుడు జాతిలో అసౌకర్యం ఆయాసం స్పృహ కోల్పోవడం తీవ్ర అలసట లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు.

## శరీరాన్ని కూలింగ్ చేయడమే కీలక ప్రక్రియ


హీట్ స్ట్రోక్ తో తొలి 5 నిమిషాలు చాలా కీలకం అంబులెన్స్ కోసం ఎదురు చూడకుండా బాధితుడుని నీడకు తరలించి గాలి తగిలేలా చెయ్యాలి తడి వస్త్రంతో శరీరాన్ని తెలవాలి మెడ సంకలు గజ్జలలో ఐస్ ప్యాక్ పెట్టాలి. షీట్ స్ట్రోక్ లో శరీరాన్ని కూలింగ్ చేయడమే వైద్యంలో కీలక ప్రక్రియ విపరీతమైన వేడి వల్ల గుండెపై భారం పెరుగుతుంది శరీరాన్ని చల్లబరచడానికి గుండె ఎక్కువ రక్తాన్ని పంపు చేయవలసి వస్తుంది. మరోవైపు డిహైడ్రేషన్ వల్ల శరీరంలో రక్త పరిమాణం మరింత తగ్గి అది కూడా గుండెకు ఒత్తిడి పెంచతుంది వృద్ధులు చిన్నారులు గర్భిణీలు ఎండలో పనిచేసేవారు వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలి వైద్యులను సంప్రదించాలని మందులు మానివేయరాదని వైద్యులు తెలిపారు.

## తప్పక పాటించవలసిన సూత్రాలు

నిరంతరాయంగా నీళ్లు తాగుతూ ఉండాలి దాహం వేసే వరకు ఉండకుండా రోజుకు 7 8 గ్లాసుల నీళ్లు తాగాలి కొబ్బరినీళ్లు మజ్జిగ నిమ్మరసం లాంటివి కూడా తీసుకోవచ్చు ఎండలో వెళ్లకపోవడమే మంచిది ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండలో వెళ్లకపోవడమే మంచిది లేత రంగు దుస్తులు వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని వైద్యులు పేర్కొంటున్నారు. అవి శరీరాన్ని చల్లబరుస్తాయి ఆల్కహాల్ వద్దు ఆల్కహాల్ శరీరాన్ని హైడ్రేట్ చేస్తాయి మద్యంతో పాటు కెఫిన్ ఉండే పానీయాలకు దూరంగా ఉండాలి. పార్క్ చేసిన వాహనాలలో ఇంటి వద్ద పార్కు చేసిన కార్లలో పిల్లలను పెంపుడు జంతువులను వదిలివేయరాదని అందులో వేడితో వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు.

# డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

### మంత్రి పొంగులేటి, వాటర్ వర్క్స్ ఎండి, కలెక్టర్ కు ఎమ్మెల్యే బండారి వినతి



**చర్లపల్లి :** డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్ ఐజీ కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం అందజేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శ్రీకారం చుట్టారు. 2009 సంవత్సరంలో జేఎన్ఎన్యూఆర్ఎం పథకం కింద సుమారు 1200 ఇళ్లను నిర్మించగా, అప్పట్లో ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతిన్నదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వివరించారు. దీంతో డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని అన్నారు. చాలావాటిలో స్లాబ్‌లు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదం నెలకొన్నదని, వాటి మరమ్మతుల కోసం కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఐజీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పరిస్థితిని వెంటనే పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణతో పాటు ఇళ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నెమూరి మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు పర్శురాము యాదవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సాగర్ గౌడ్, వెంకటేష్, ప్రహ్లాద్ రెడ్డి, రవి యాదవ్, వెంకటేశ్వర్ రావు, లోక్‌నాథ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పొదుపు మంత్రం ఎకానమీకి శుభ సూచకం

### నమో మంత్ర ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి



**రంగారెడ్డి ప్రతినిధి ఆర్గాన్ న్యూస్, మే 12:** పశ్చిమ సియా యుద్ధం దెబ్బతో క్రూడ్ ఆయిల్ రేట్లు భారీగా పెరగడంతో మన ఆర్థిక వ్యవస్థకు బాగానే సెగ తగులుతుందని, ఇటీవల తెలంగాణలో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పొదుపు మంత్రం ఎకానమీకి శుభ సూచకమని, నమో మంత్ర ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ ముడి సమురు ధరలు డాలర్లకు పైకి దూసుకుపోవడంతో దిగుమతుల బిల్లు తడిసి మోపెడు అవుతుందని మరోపక్క బంగారం రేపు కూడా దూసుకు వెళుతూ ఉండడంతో విదేశీ మారక నిలువలు దిగజారుతున్నాయని అన్నారు. దీని ప్రభావంతో రూపాయి రోజురోజుకు కొత్త కనిష్టానికి దిగజారి నేలచూపులు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా 95.28 ఆల్ టైం కనిష్టానికి పడిపోయిందని ఈ నేపథ్యంలో తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు చేసిన సూచన దేశవ్యాప్తంగా అటు పరిశ్రమ వర్గాలు ఇటు ప్రజలలో సంచలనం రేపుతుందని ఎకానమీకు దన్నుగా విదేశీ మరక ద్రవ్యాన్ని ఆదా చేయడం కోసం పొదుపు చర్యలు పాటించాలంటూ మోదీ పిలుపునివ్వడం ఆనందించదగ్గ విషయమని అన్నారు ముఖ్యంగా బంగారం కొనుగోళ్లు వాయిదా వేసుకోవాలని పెట్రోల్ డీజిల్ వాడకాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలని నరేంద్ర మోడీ ఆదేశించడం అభివృద్ధి స్వాగతించదగ్గ విషయమని అన్నారు. అలాగే విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవడం వంటనూనెలు ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని కూడా పేర్కొన్నారని అన్నారు ఈ చర్యలతో ఆర్థిక వ్యవస్థకు లాభంతో పాటు నష్టాలు కూడా ఉంటాయని ఆర్థికవేత్తలు చెబుతున్నారని దిగుమతుల భారం తగ్గడంతో కాస్త కరెంటు ఖాతా లోటు దిగివచ్చి రూపాయికి దన్నుగా నిలిచినప్పటికీ దేశీయంగా వినిమయం తగ్గడంతో ఎకానమీ మందగించే ప్రమాదం కూడా ఉందని ఆర్థిక విశ్లేషకులు విశ్లేషిస్తున్నారని అన్నారు.

## బంగారం గుదిబండ

భారతీయులు సహజంగానే పసిడి ప్రియులని పెళ్లిళ్లు శుభకార్యాలకు ఆభరణాలకు కొనుగోళ్లకు తోడు ఇటీవల పెరిగిన పుత్తడి రేట్లు పెట్టుబడులకు కూడా మనలో సై అంటున్నారని దీనితో బంగారం దిగుమతులు భారీగా పెరుగుతూనే ఉన్నాయని ఏటా దేశంలోకి 700 నుండి 800 టన్నుల బంగారం దిగుమతి అవుతుందని దేశంలో ఉత్పత్తి అవుతున్నది కేవలం ఒకటి రెండు టన్నులు మాత్రమేనని 90 శాతం పైగా దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఉందని దేశ దిగుమతుల్లో ఇది దాదాపు పది శాతం మరో పక్క ఆపదలో ఆదుకునే సాధనంగా పసిడి కి ప్రాముఖ్యత పెరగడంతో సెంట్రల్ బ్యాంకులు కూడా ఫాలోమంటూ గోల్డ్ నిలువలు పెంచుకుంటున్నాయని మన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా టన్నుల కొద్ది బంగారం పోగేసుకుంటుందని ప్రస్తుతం నిలువలు 88 టన్నులకు చేరాయని 2005-06 సంవత్సరంలో 72 బిలియన్ డాలర్ల విలువైన బంగారం దిగుమతి అయిందని దీనివల్ల భారీ మొత్తంలో ఫారెన్ నిలువలు వెచ్చించాల్సి వస్తుందని అయితే రేట్లు భారీగా పెరగడంతో ఇటీవల బంగారం దిగుమతులు బాగానే తగ్గుముఖం పట్టాయని అయితే రేటు అంతర్జాతీయంగా ప్రస్తుతం 4700 డాలర్లుగా ఉందని అన్నారు అధిక స్థాయిలో కొనసాగుతూ ఉండటంతో భారీగా డాలర్లు వెచ్చించాల్సి వస్తుందని మోదీ చెప్పినట్లుగా బంగారం కొనుగోలు తగ్గించుకుంటే దిగివతలు దిగివచ్చి ఫారెన్ నిల్వలకు దన్నుగా నిలుస్తాయని అన్నారు.

## పొదుపు కాలం

ఎన్నికల హోరు సద్దుమణిగి రాష్ట్రాలన్నిటా ప్రభుత్వాలు ఏర్పాటు పూర్తి కావస్తున్న దశలో ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలను ఉద్దేశించి ఒక హెచ్చరిక లాంటి హితోపదేశం చేశారని పచ్చిమాసియా యుద్ధం పరంగా ఏర్పడిన సంక్షోభాన్ని అధిగమించడానికి కోవిడ్ కాలంలో అనుసరించిన పొదుపు చర్యలు తప్పనిసరి అంటూ పౌరులకు సూచించారని ఆయన చెప్పిన వాటిల్లో వర్క్ ఫ్రం హోమ్ ప్రజా రవాణా వ్యవస్థల వినియోగం ఏడాది పాటు బంగారం కొనుగోళ్ల నిలిపివేత విదేశీ ప్రయాణాలు మానుకోవడం రైతులు యూరియా వాడకాన్ని తగ్గించడం వంటి ఉన్నాయని ఇందులో చాలా వరకు పాటించదగ్గవే అని అన్నారు దీనికి తోడు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఆదివారం పెట్రోల్ బంకులు మూసేస్తారని సోమవారం వెళ్ళడైన వివరాలను బట్టి తమ సంస్థలు రోజుకు 1700 కోట్లు నష్టపోతున్నాయని అన్నారు గత పది రోజుల్లో మొత్తం నష్టాలు లక్ష కోట్ల మీద ఉన్నాయని దీని సారాంశం అని నిజానికి ఎన్నికల ప్రచార మధ్యలో మోడీ ఒకసారి సూచనగా పరిస్థితిని తీవ్రతను చెప్పారని కానీ ఎన్నికల అనంతరం పెట్రోల్ ధరలు భారీగా పెరుగుతాయని పర్యవసానంగా అన్ని సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతాయని విపక్షాలు ప్రచారం చేయడంతో బిజెపి బెంబేలు పడి ఇక దాని జోలికి పోలేదని దేశ ప్రజల్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భయాందోళనకు గురి చేస్తున్నారని పచ్చిమాసియా ఉధృతత ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను జలసంధి ఇరాన్ అమెరికాలో దిబ్బందించడంతో ఇంధన సరఫరా నిలిచిపోయిందని మన దేశం మాత్రమే వీటన్నిటిని అతీతంగా మనుగడ సాగిస్తుందని మన ఆర్థిక వ్యవస్థ అన్నింటిని తట్టుకోగలరని భావించడం అమాయకత్వం అని అన్నారు.



## హనుమాన్ జయంతి పర్వదినం భక్తిశ్రద్ధల సమాహారం

- సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 12:** హనుమాన్ జయంతి పర్వదినం భక్తిశ్రద్ధల సమాహారమని, ఆధ్యాత్మికతతో పాటు ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యత పెరగాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాలను ఆయన సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో హనుమంతుడు ధైర్యానికి, నిస్వార్థ భక్తికి నిలువుటద్దమని కొనియాడారు. సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసినప్పుడే ధర్మ రక్షణ సాధ్యమవుతుందని, ఆ దిశగా ఆలయ కమిటీలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను ఆయన ప్రారంభించి, నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు దేవాలయ కమిటీలు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, నాయకులు మొహమ్మద్ యూసుఫ్, బోయిన విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## నీట్ పేపర్ లీకేజీ దారుణం దోషులను కఠినంగా శిక్షించాలి

### జాజుల లింగంగౌడ్

**మిర్యాలగూడ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 12:** నీట్ (యూజీ)–2026 ప్రశ్నాపత్రాల లీకేజీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన ఘటన అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. మే 3న నిర్వహించిన నీట్ పరీక్షను ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా రద్దు చేస్తున్నట్లు జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) ప్రకటించడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. రాజస్థాన్‌లో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అమరవీరుల స్థూపం వద్ద ఫ్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ, అత్యంత భద్రత మధ్య ఉండాల్సిన ప్రశ్నాపత్రాలు ఈ విధంగా లీక్ కావడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘటనలు విద్యా వ్యవస్థపై విద్యార్థుల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి, హాస్టళ్లలో ఉంటూ కోచింగ్ తీసుకుంటూ రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల శ్రమ వృథా అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, రాంబాబు, లవన్ కుమార్, వెంకటయ్య, సతీష్, వెంకటేష్, నవీన్, సందీప్, ప్రదీప్, గౌతమ్, శిల్ప, అశ్విని, స్వాతి, లావణ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

## సుబాబుల్ తోట దగ్ధం

### రూ.3 లక్షల ఆస్తి నష్టం



**చింతకాని ఆర్గాన్ న్యూస్:** చింతకాని మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామం, బస్వాపురం రెవెన్యూ పరిధిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుని సుబాబుల్ తోట పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన అడ్వకేట్ కన్నెబోయిన నాగేశ్వరావుకు చెందిన సర్వే నంబర్ 160లో ఉన్న సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలోని రెండేళ్ల వయస్సు గల సుబాబుల్ తోట అగ్నికి ఆహుతి అయింది. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు. చుట్టుపక్కల రైతులు చెత్తకునిప్పంటించడంతో మంటలు వేగంగా వ్యాపించి తోటను చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. దూర ప్రాంతం నుంచి వచ్చిన మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో చెట్లు పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదం తీవ్రత అధికంగా ఉండటంతో తోట చుట్టూ ఏర్పాటు చేసిన పెన్సింగ్ రాళ్లు కూడా వేడికి పటుత్వం కోల్పోయాయి. కొన్ని రాళ్లు ఇప్పటికే కూలిపోగా, మరికొన్ని ముట్టుకుంటే పడిపోయే పరిస్థితిలో ఉన్నాయని రైతు నాగేశ్వరావు తెలిపారు. రెండేళ్లుగా ఎంతో శ్రమించి పెంచుకున్న తోట ఒక్కసారిగా దగ్ధమవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై స్థానిక అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తరఫున తగిన పరిహారం అందించాలని బాధిత రైతు కన్నెబోయిన నాగేశ్వరావు కోరుతున్నారు.

## శ్రీనివాస రామానుజన్ టెస్ట్‌లో త్రివేణి విద్యార్థుల విజయం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 12:** ఏప్రిల్ 15 తేదీన శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ లో నిర్వహించిన ప్రైమరీ లెవెల్ పరీక్ష ఫలితాలలో త్రివేణి విద్యార్థులు ప్రథమ ర్యాంకు సాధించగా హైదరాబాద్ శిల్పకళా వేదిక నందు రామానుజ న్ ఫౌండేషన్ వారు విజేతలకు బహుమతులు అందజేశారు. విజయం సాధించిన త్రివేణి విద్యార్థులు విహన్, తస్విన్, కోమల్, శివ, అచ్యుత్ ప్రైమరీ లెవెల్ ర్యాంకులు ర్యాంకులు సాధించడం పట్ల త్రివేణి కృష్ణవేణి డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ అభినందనలు తెలిపారు. విజేతలైన విద్యార్థులకు త్రివేణి డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సిఆర్ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, ప్రైమరీ వైస్ ప్రిన్సిపల్ సౌజన్య శుభాకాంక్షలు తెలియజేశారు.

# నిబంధనలకు లోబడే రీ సర్వే

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రతి రైతుకు పూర్తి అవగాహన కల్పించి రీ సర్వే చేయాలి
- ప్రభుత్వ భూములు, రహదారులు, ప్రజా స్థలాల వివరాలు కోఆర్డినేట్లతో నమోదు చేయాలి
- రోజుకు ప్రతి బృందం 50 నుండి 70 ఎకరాల వరకు రీ సర్వే పూర్తి చేయాలి
- సర్వే వివరాల డేటా ఎంట్రీ, మ్యాప్ తయారీ సమాంతరంగా కొనసాగాలి
- తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో చేస్తున్న రీ సర్వే అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్



**తిరుమలాయపాలెం, మే 12 :** రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. తిరుమలాయ-పాలెం మండలం కాకరవాయి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం పరిశీలించి రీ సర్వే నిర్వహిస్తున్న అధికారులను కలిసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... కాకరవాయి గ్రామంలో ఆర్ఎస్ఆర్ పట్టా విస్తీర్ణ సమస్యలు ఉన్నందున వాటి పరిష్కారం కోసం రీ సర్వే చేపడుతున్నామని, భూ వివాదాల పరిష్కారం, భూ రికార్డుల నవీకరణ లక్ష్యంగా రీ సర్వే చేపట్టి, భూముల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయనున్నట్లు చెప్పారు. రైతు వేదికను కేంద్రంగా చేసుకుని అక్కడే కంప్యూటర్ ఏర్పాటు చేసి భూ వివరాలను నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో రీ సర్వే నిర్వహణ కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి బృందంలో ఒక సర్వేయర్, జీపీవోలు ఉంటారని చెప్పారు. రీ సర్వే ప్రక్రియలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, జీవో ప్రకారం విధి విధానాలు అమలు చేయాలని ఆదేశించారు. మొదట ఫారం–6 ఇవ్వాలని, అనంతరం 15 రోజుల గడువు పాటించిన తరువాతే తదుపరి ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పూర్తి ప్రక్రియను గుర్తించి అమలు చేయాలని సూచించారు. ఇందుకోసం ఎస్ఓపీ సిద్ధం చేసుకుని దశలవారీ విధానాన్ని ఖచ్చితంగా అనుసరించాలని తెలిపారు. గ్రామంలోని అన్ని రహదారులు, ప్రజా స్థలాలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ సంస్థల భూముల వివరాలను కోఆర్డినేట్లతో సహా ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల వివరాలను స్పష్టంగా పంచనామా చేసి నమోదు చేయాలని సూచించారు. ప్రతి బృందం రోజుకు 50 నుంచి 70 ఎకరాల వరకు రీ సర్వే పూర్తి చేయాలని, ఐదు బృందాలు కలిసి రోజుకు సుమారు 250 నుంచి 300 ఎకరాల వరకు సర్వే నిర్వహించాలని కలెక్టర్ లక్ష్యాలను నిర్దేశించారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకే బృందాలు క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి రైతు పేరు, భూ విస్తీర్ణం, పూర్తి వివరాలు సేకరించి నమోదు చేయాలని సూచించారు. ప్రతిరోజూ సర్వే నివేదికలు సమర్పించాలని, సర్వే వివరాల డేటా ఎంట్రీ, మ్యాప్ తయారీ ప్రక్రియ సమాంతరంగా కొనసాగాలని తెలిపారు. ఈ గ్రామంలో ఆర్ఎస్ఆర్ పట్టా విస్తీర్ణ సమస్యలు ఉన్నందున వాటి పరిష్కారం కోసం రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. రీ సర్వే ద్వారా ఎవరూ తమ భూమి విస్తీర్ణాన్ని కోల్పోరని స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామంలో సర్వే నంబర్ల విషయంలో ఉన్న గందరగోళం పూర్తిగా తొలగిపోతుందని, అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. రీ సర్వే విజయవంతంగా నిర్వహించాలంటే గ్రామ సభలు నిర్వహించడం తప్పనిసరి అని చెప్పారు. రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న మూడు గ్రామాల ప్రజలందరినీ గ్రామ సభకు ఆహ్వానించాలని సూచించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో రీ సర్వే సమయంలో వివిధ సమస్యలు వచ్చే అవకాశముందని, అందుకే ఆర్డీఓ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే కమిటీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, కమిటీ ఆమోదించిన తరువాత మాత్రమే సర్వే ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఎలాంటి వివాదాలకు దిగకుండా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, సర్వేయర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## రానున్న 15 రోజులు మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లకు అత్యంత కీలకం

### జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 12:** రానున్న 15 రోజులు మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లకు అత్యంత కీలకమని, క్షేత్రస్థాయిలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలో మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న నిల్వలు, లోడింగ్ పరిస్థితులు, గోడౌన్ల అందుబాటు, రవాణా సదుపాయాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇల్లందు నియోజకవర్గ పరిధిలో సుమారు 9,300 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వలు ఉన్నాయని, లోడింగ్‌లో జాప్యం ఎందుకు జరుగుతోందనే అంశంపై కారణాలను అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. గోడౌన్ల అందుబాటు కోసం బయ్యారం, ములకలపల్లి, కృష్ణసాగర్, దుమ్ముగూడెం, వాజేడు, వెంకటాపురం, కొత్తగూడెం, బంగారుచిలక ప్రాంతాల్లో నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నందున త్వరితగతిన లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న మూడు రోజుల్లో ఇల్లందు ప్రాంతంలోని మొక్కజొన్నను గోడౌన్లకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. మార్క్‌ఫెడ్, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు, రవాణా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రవాణా విషయంలో లోడింగ్ కాంట్రాక్టర్లు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అవసరమైతే మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో పోలీస్ శాఖ సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు. హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కడైనా గోడౌన్ సమస్య తలెత్తితే తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్లు, పాఠశాల భవనాలు ఇతర అనుకూల భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించి, ఆయా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలనలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతిరోజూ కొనుగోలు వివరాలను నిరంతరం నివేదికల రూపంలో అందించాలని, కొనుగోలు పూర్తైన వెంటనే 24 గంటల్లో ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అదనపు కలెక్టర్, డిసీఎస్‌వో, డీటీవో, డీఎం సివిల్ సప్లై తదితర అధికారులు ప్రతిరోజూ కొనుగోలు, లోడింగ్, అన్‌లోడింగ్, గోడౌన్ల పరిస్థితి, హమాలీల అందుబాటు, గన్నీ బ్యాగుల సరఫరా వంటి అంశాలను పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 12:** రాష్ట్రంలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీలు, తూకం యంత్రాలు తదితర అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా ఇకముందు ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారులను నియమించి తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రికి తెలిపారు. గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా వాహనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించేలా ప్రత్యేక ప్రణాళికతో వ్యవహరిస్తున్నామని చెప్పారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపడుతున్నామని, అవసరమైన చోట తాత్కాలిక నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ధాన్యం, మొక్కజొన్న సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పథకం అమలులో ప్రభుత్వం విఫలం

- ప్రజల తాగునీటి అవసరాల కోసం నిధుల మంజూరులో సర్కార్ నిర్లక్ష్యం
- నీటిపథకాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి
- నీటి సరఫరా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 12:** ప్రజా దాహార్తిని తీర్చేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఓవర్ హెడ్ ట్యాంకులు, రిజర్వాయర్లు, పైపులైన్ల నిర్మాణం, బోర్ల తవ్వకం పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పనుల్లో జరుగుతున్న నిర్లక్ష్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల తాగునీటి అవసరాల కోసం నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ తీరు ఏమాత్రం ఆశాజనకంగా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమని చెప్పుకుంటున్న మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో విఫలమైందని, పనుల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. నిధుల మంజూరు విషయంలో ప్రభుత్వం చూపుతున్న వివక్షను ఆయన నిలదీశారు. నీటి సమస్య పరిష్కారం కోసం తాను అందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పక్కన పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి దృష్ట్యా ప్రజలు అల్లాడకుండా నిరంతరం నీటి సరఫరా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. నిధుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, అయితే ఉన్న వనరులతో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అధికారులు తిరుమలేశ్, శివయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లపై స్పెషల్ డ్రైవ్

**మిర్యాలగూడ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 12:** ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులు స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని రైస్ మిల్లుల వద్ద సివిల్ సప్లైస్ అధికారులు, తహశీల్దార్లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే అధికారులు మిల్లులను సందర్శించి ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలను పరిశీలించారు. మిల్లుల వద్ద ధాన్యం లోడుతో వచ్చిన వాహనాలు బారులు తీరడంతో అధికారులు పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమణారెడ్డి మిల్లర్ యాజమాన్యాలతో సమావేశమై అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దిగుమతుల్లో జాప్యం, నిర్లక్ష్యం ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

# ఐటీ స్టాక్స్‌కు ఓపెన్ ఏఐ షాక్..

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. బెంచ్ మార్క్ సూచీలు 1 శాతానికి నష్టాల్లో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల వల్ల సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా ఓ దశలో 3.7 శాతం మేర నష్టపోయింది. 2023 మే తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. అమెరికాకు చెందిన ఏఐ సంస్థ ఓపెన్‌ఏఐ కొత్త కంపెనీని ప్రకటించడం ఇందుకు నేపథ్యం. శామ్‌ఆల్ట్‌మన్ నేతృత్వంలోని ఓపెన్ ఏఐ సంస్థ కొత్తగా 'ఓపెన్ ఏఐ డిప్లాయ్‌మెంట్ కంపెనీ'ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం 4 బిలియన్ డాలర్లు వెచ్చించనున్నట్లు తెలిపింది. సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను ఏఐ సిస్టమ్స్‌తో నిర్వహించుకోవడం దీని ఉద్దేశం. దీంతో సంప్రదాయ ఐటీ సర్వీస్ కంపెనీల వ్యాపారానికి ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది నేటి ట్రేడింగ్ సెషన్‌లో ప్రతిఫలించిందని నిపుణులు చెబుతున్నారు. మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.7 శాతానికి పైగా నష్టంతో దాదాపు 1000 పాయింట్లకు పైగా కోల్పోయి 28,300 స్థాయికి పడిపోయింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్‌లోని అన్ని స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. పెర్సిస్టెంట్ సిస్టమ్స్ ఐదు శాతం మేర




పతనం కాగా.. టీసీఎస్, ఎల్‌టీఎం, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, కోఫోర్జ్ సైతం 2-4 శాతం మేర నష్టోయాయి. అయితే, కేవలం ఏఐ మాత్రమే కాకుండా అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయన్న ఆందోళనలు, దీనివల్ల భవిష్యత్‌లో ఐటీ కంపెనీల ఆదాయాలు తగ్గుతాయన్న భయాలూ దీనికి తోడయ్యాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇటీవల వెలువడిన త్రైమాసిక ఫలితాల సందర్భంగా భవిష్యత్ అంచనాలేమీ అంత ఆకర్షణీయంగా లేకపోవడం కూడా మరో కారణమని చెబుతున్నారు.






## 10 లక్షల కోట్లు ఆవిరి

### భారీ నష్టాల్లో సూచీలు..

**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాల నడుమ వరుసగా నాలుగో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపాయి. దీనికితోడు ప్రధాని మోదీ పొదుపు చర్యలు ప్రకటించడం, ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం 'లైఫ్ సపోర్ట్' మీద ఉందంటూ ట్రంప్ వ్యాఖ్యానించడం వంటివి మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 1500 పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 23,400 దిగువకు చేరింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్కరోజులోనే రూ.10 లక్షల కోట్లు క్షీణించి రూ.457 లక్షల కోట్లకు చేరింది. రోజంతా నష్టాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 75,688.39 (క్రితం ముగింపు 76,015.28) పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 74,449.50 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1456 పాయింట్ల నష్టంతో 74,559.24 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 436 పాయింట్ల నష్టంతో 23,379.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.63 వద్ద జీవనకాల కనిష్ఠానికి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క ఎస్‌బీఐ మినహా మిగిలిన కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో ముగిశాయి. టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, టైటాన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4700 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

### కారణాలు ఇవే..

- పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, ఏడాది పాటు బంగారం కొనొద్దంటూ ప్రధాని చేసిన సూచనలు వినియోగ ఆధారిత రంగాలపై ప్రతికూల ప్రభావం చూపాయి. దీర్ఘకాలంలో వృద్ధి మందగించొచ్చన్న భయాలు సూచీలను ప్రభావితం చేశాయి.
- శాశ్వత శాంతి కోసం టెహ్రాన్ పంపిన తాజా ప్రతిపాదనను డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించడంతో పాటు అది తమకు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు మరోసారి విఫలమవ్వడం, యుద్ధ భయాలు నెలకొనడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లలో ఆందోళన పెరిగింది.
- బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్ 100 డాలర్ల ఎగువన స్థిరంగా కొనసాగుతుండడం భారత ఆర్థిక వ్యవస్థపై భారాన్ని పెంచుతోంది. ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుందనే భయం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.
- డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయిలో 95.63 వద్దకు పడిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూపాయి సుమారు 6 శాతం మేర క్షీణించింది. దీనికితోడు విదేశీ మదుపర్ల అమ్మకాల కొనసాగుతుండడమూ ప్రతికూల ప్రభావం చూపింది.





## గుజరాత్ చేతిలో సన్‌రైజర్స్

# ఘోర పరాజయం

**అహ్మదాబాద్:** సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. మంగళవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును 82 పరుగుల తేడాతో చిత్తు చిత్తుగా ఓడించింది. గుజరాత్ పేసర్ల ధాటికి సన్‌రైజర్స్ కుదేలైంది. 169 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన ఎస్‌ఆర్‌హెచ్ 14.5 ఓవర్లలో 86 పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ టీమ్‌లో ఏ బ్యాటర్ కూడా 20 పరుగులు చేయలేకపోయాడంటే గుజరాత్ బౌలర్లు ఏ స్థాయిలో విజృంభించారో అర్థం చేసుకోవచ్చు. ఎనిమిదో స్థానంలో వచ్చిన కమిన్స్ (19) టాప్ స్కోరర్. సలీల్ అరోరా (16), క్లాసెన్ (14), ఇషాన్ కిషన్ (11) పరుగులు చేశారు. నాలుగు బంతులు ఎదుర్కొన్న ట్రావిస్ హెడ్ డకౌట్ అయ్యాడు. అభిషేక్ శర్మ (6), స్మరన్ రవిచంద్రన్ (9), నితీశ్ రెడ్డి (2) పరుగులకే వెనుదిరిగారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కగిసో రబాడ (3/28), జేసన్ హోల్డర్ (3/20) హైదరాబాద్‌ను దెబ్బకొట్టారు. ప్రసిద్ధ్ కృష్ణ 2, సిరాజ్, రషీద్ ఖాన్ ఒక్కో వికెట్ తీశారు. ఈ గెలుపుతో గుజరాత్ టీమ్ (16 పాయింట్లు) అగ్రస్థానానికి దూసుకెళ్లింది. జీటీ దాదాపుగా ప్లేఆఫ్స్‌నకు చేరినట్టే. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (61; 44 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), వాషింగ్టన్ సుందర్ (50; 33 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు సాధించారు. నిశాంత్ సింధు (22) పరుగులు చేశాడు. శుభ్‌మన్



గిల్ (5), బట్లర్ (7) సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. సన్‌రైజర్స్ బౌలర్లలో సాకిబ్ హుస్సేన్ 2, ప్రఫుల్ హింగే 2, కమిన్స్ ఒక వికెట్ పడగొట్టారు. ఐపీఎల్‌లో పరుగుల పరంగా సన్‌రైజర్స్‌కు ఇది అతిపెద్ద



ఓటమి కావడం గమనార్హం. అంతేకాదు ఐపీఎల్ చరిత్రలో హైదరాబాద్‌కు ఇదే అత్యల్ప స్కోరు.

## కోహ్లీపై తప్పుడు ఆరోపణలు చేస్తే

# డబ్బులిస్తామన్నారు : జర్మనీ మోడల్ లిజ్లాజ్

కొన్ని రోజుల కిందట విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి కొట్టిన లైక్‌తో జర్మనీ మోడల్ లిజ్లాజ్ పాపులరైన సంగతి తెలిసిందే. దీంతో కోహ్లీని నెటిజన్లు ట్రోల్ చేశారు. ఆ లైక్ వెనక అతనికి దురుద్దేశం లేకపోయినా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారని లిజ్లాజ్ అప్పట్లోనే క్లారిటీ ఇచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఈ అంశానికి సంబంధించి సంచలన విషయాన్ని బయటపెట్టింది. కోహ్లీపై తప్పుడు ఆరోపణలు చేసేలా తనను ఒప్పించడానికి కొంతమంది జర్నలిస్టులు సంప్రదించారని, అలా చేయడానికి తనకు డబ్బు కూడా ఆఫర్ చేశారని పేర్కొంది. "కొందరు విలేకరులు విరాట్ కోహ్లీ గురించి చెడుగా మాట్లాడాలని నన్ను ఒప్పించడానికి ప్రయత్నించారు. అతనిపై లేని పోని ఆరోపణలు చేయమని డబ్బు ఆఫర్ చేశారు. కానీ నేనెందుకు అలా చేస్తాను?డబ్బు లేదా ప్రచారం కోసం కోహ్లీ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఆసక్తి గానీ, ఉద్దేశం గానీ నాకు లేదు" అని లిజ్లాజ్ తెలిపింది. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ 'లైక్' నేపథ్యంలో కోహ్లీపై ట్రోలింగ్ జరగడంతో ఈ జర్మనీ మోడల్ కొన్ని రోజుల కిందట స్పందించింది. విరాట్‌పై విమర్శలు రావడం బాధగా అనిపించిందని పేర్కొంది. "ముందు విరాట్ కోహ్లీ నా ఫొటోని లైక్ చేసినప్పుడు ఎంతో సంతోషించాను. ఆ తర్వాత ఆ పోస్ట్‌ని ఆయన అన్‌లైక్ చేశారు. అనుకోకుండా నేను పాపులర్ అయినందుకు ఆనందమే కానీ, తర్వాత బాధగా అనిపించింది. ఈ ఒక్క లైక్ సోషల్ మీడియాలో ఇంత పెద్ద స్టోరీ అవుతుందని ఊహించలేదు. కోహ్లీని ఇంతగా ట్రోల్ చేస్తారనుకోలేదు. ఆ లైక్ వెనక అతనికి దురుద్దేశం లేకపోయినా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారు. ఏదేమైనా నా ఫొటోని స్టార్ క్రికెటర్ లైక్ చేసినందుకు గర్వంగా అనిపించింది" అని లిజ్లాజ్ వివరించింది. ఈ జర్మనీ మోడల్‌కు ఐపీఎల్ మ్యాచ్‌లంటే తెగ ఇష్టమట. ఆర్సీబీకి వీరాభిమాని అని చెప్పింది.





## చమురు సంస్థలకు రూ.లక్ష కోట్ల నష్టాలు రావొచ్చు

### కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ

పశ్చిమాసియా సంక్షోభాన్ని తట్టుకోవడానికి ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు ఓ మేల్కొలుపు అని చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ వెల్లడించారు. అదే సమయంలో దేశంలో ఇంధన సరఫరా సమస్యలు ఏవీ లేవని, ప్రభుత్వం ఉత్పత్తిని రోజుకు 35,000-36,000 టన్నుల నుంచి 54,000 టన్నులకు పెంచినట్లు తెలిపారు. అయితే, భగ్గుమంటున్న ముడిచమురు ధరల వల్ల ఆయిల్ కంపెనీలకు రూ.లక్ష కోట్ల వరకు నష్టాలు రావొచ్చని హెచ్చరించారు. సీఐఐ వార్షిక వ్యాపార సదస్సులో మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "పశ్చిమాసియా ఘర్షణల వేళ ఆర్థిక భారాన్ని తగ్గించే చర్యల గురించి ఆలోచించడానికి ప్రధాని మోదీ (గ్రావీ వీశీఉ) ఇచ్చిన పిలుపు ఒక మేల్కొలుపు. యుద్ధం నేపథ్యంలో ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని మనం ఎంతో బాధ్యతాయుతంగా ఎదుర్కొన్నాం. ఎక్కడా కొరత లేదు" అని మంత్రి వెల్లడించారు. దేశంలో 69 రోజులకు సరిపడా ముడిచమురు, ఎల్ఎన్‌జీ స్టాక్ ఉందని, 45 రోజులకు సరిపడా ఎల్‌పీజీ ఉందని పేర్కొన్నారు. అయితే ముడి చమురు ధరలు అధికంగా ఉండి, రిటైల్ ధరలు ఇలాగే కొనసాగితే ఒకే త్రైమాసికంలో ప్రభుత్వరంగ చమురు సంస్థలు రూ.లక్ష కోట్ల వరకు నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ఆయన అన్నారు. "చమురు కంపెనీలు రోజుకు రూ.1000కోట్లు నష్టపోతున్నాయి. మొత్తంగా రెవెన్యూ లోటు రూ.1.98లక్షల కోట్లకు పెరిగింది. ఒక్క త్రైమాసికంలోనే రూ.లక్ష కోట్ల మేర నష్టాలు వస్తే, ఈ రంగం ఆర్జించే వార్షిక లాభాలు తుడిచిపెట్టుకుపోతాయి" అని పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలను దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ పొదుపు చర్యల గురించి దేశ ప్రజలకు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. "పశ్చిమాసియాలో సాధారణ పరిస్థితులు నెలకొనేంతవరకు దేశ ప్రజలంతా పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలి. ప్రజా రవాణా సౌకర్యాలను ఎక్కువగా వినియోగించుకోవాలి. 'వర్క్ ఫ్రమ్ హోం'ను సంస్థలు ప్రోత్సహించాలి. విద్యాసంస్థలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలి. బంగారం కొనుగోలు చేస్తే దేశానికి చెందిన డబ్బులు విదేశాలకు వెళ్లిపోతాయి. కాబట్టి సాధారణ పరిస్థితులు నెలకొనేవరకు పసిడి కొనకండి. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లకండి. భారత్‌లోనే పెళ్లిళ్లు జరుపుకోండి" అని మోదీ కోరారు.

## పెళ్లిపై ఫరియా అబ్దుల్లా షాకింగ్ కామెంట్స్..

టాలీవుడ్ కుర్రకారు చిట్టి అని ప్రేమగా పిలుచుకునే ఆరడుగుల అందగత్తె ఫరియా అబ్దుల్లా, తన మొదటి సినిమా 'జాతిరత్నాలు'తోనే ఓ రేంజ్ పాపులారిటీ సొంతం చేసుకుంది. తన సహజ సిద్ధమైన నటన, చలాకీతనంతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం సందీప్ కిషన్ సరసన 'సిగ్మా' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పెళ్లి వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. పెళ్లి అనే బంధం పట్ల యువత మారుతున్న తీరుపై ఫరియా తన ఆందోళనను వ్యక్తం చేసింది. "జీవితంలో ఒక తోడు ఉండటం, ఒక వ్యక్తి మనల్ని ప్రేమిస్తున్నారు అనే భావన మనసుకి ఎంతో అద్భుతంగా ఉంటుంది. పెళ్లి వల్ల ఒక మనిషి తనను తాను మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుంది. కానీ, దురదృష్టవశాత్తూ ప్రస్తుత తరం పెళ్లిపై ఆసక్తిని కోల్పోతోంది. రాబోయే కాలంలో ఈ బంధానికి అసలు అర్థమే మారిపోతుందేమో అనిపిస్తోంది" అని ఆమె తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. ఇక తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ.. పెళ్లి పట్ల తనకు సానుకూల దృక్పథమే ఉందని, అయితే ఇప్పటివరకు తన మనసుకి నచ్చిన సరైన వ్యక్తి దొరకలేదని వెల్లడించింది. అందుకే ప్రస్తుతానికి వివాహం గురించి ఆలోచించడం లేదని స్పష్టం చేసింది.



## విడాకుల జాబితాలో మరో నటి

### భర్తను అన్ ఫాలో చేసిన మౌనీరాయ్

నటి మౌనీరాయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. భర్త సూరజ్ నంబియార్‌తో ఆమె విడిపోతున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు బలం చేకూర్చేలా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్ తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ టూర్స్ ఫొటోలను షేర్ చేస్తుంటారు. కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. అలాగే రూమర్స్‌ను ఇద్దరూ ఖండించకపోవడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. 2022 జనవరిలో తన ప్రియుడు సూరజ్ నంబియార్‌ను మౌనీరాయ్ గోవాలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. మౌనీరాయ్ 'విశ్వంభర'లో ఓ స్పెషల్ సాంగ్ చేసినట్లు సమాచారం. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. చిరంజీవి సూపర్ హిట్ సినిమా 'ఖైదీ'లోని రగులుతోంది మొగలిపొద.. పాట రీమేక్‌కు మౌనీరాయ్‌తో కలిసి చిరు మరోసారి మెస్మరైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది.



# వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త

### రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ



మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ. 25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ. 15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టు కోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కమల్-రజనీ మూవీలో త్రిష

తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.





## ఎన్టీఆర్ -నీల్ ప్రాజెక్ట్ మూవీ

### మే 19న అర్ధరాత్రి గ్లింప్స్ విడుదల

జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎన్టీఆర్-నీల్' ప్రాజెక్ట్ నుంచి అదిరిపోయే అప్డేట్ రాబోతోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా కెజిఆఎఫ్, 'సలార్' సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మాస్ యూనివర్స్‌ను సృష్టించిన ప్రశాంత్ నీల్, ఇప్పుడు తారక్‌ను ఎలా చూపించబోతున్నాడోననే ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను తారక్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో మే 20న అభిమానులకు భారీ ట్రీట్ ఖాయమని అందరూ భావించారు. అయితే ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం, అభిమానుల ఉత్కంఠను మరింత పెంచేలా మేకర్స్ ఒక రోజు ముందుగానే గ్లింప్స్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంటే మే 19 అర్ధరాత్రి 12 గంటలకే ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదల కానున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అర్ధరాత్రి నుంచే సోషల్ మీడియాలో తారక్ ఫ్యాన్స్ సంబరాలు మొదలయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చిన్న చిన్న లీక్స్, సెట్స్ ఫోటోలు అభిమానుల్లో భారీ హైప్ తీసుకొచ్చాయి. ఇప్పుడు ఫస్ట్ గ్లింప్స్‌తో ప్రశాంత్ నీల్ సృష్టించిన కొత్త ప్రపంచం ఎలా ఉండబోతుందో చూడాలని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు మే 18న రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' ట్రైలర్ విడుదల కానుండటంతో సోషల్ మీడియాలో ఇప్పటికే మెగా అభిమానుల హంగామా మొదలైంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాను 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తారక్ నుంచి వస్తున్న ఈ భారీ సోలో ప్రాజెక్ట్ కావడంతో ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక మే 19 అర్ధరాత్రి విడుదలయ్యే గ్లింప్స్‌లో తారక్ లుక్, క్యారెక్టర్, సినిమా బ్యాక్‌డ్రాప్‌పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.

## శ్రీనివాస మంగాపురం సెకండ్ సింగిల్ ప్రోమో




మంగళవారం సినిమా హిట్ తరువాత అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న చిత్రాల్లో శ్రీనివాస మంగాపురం ఒకటి. ఘట్టమనేని వారసుడు జయకృష్ణ హీరోగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పించడం మరింత బజ్ ని క్రియేట్ చేసింది. తాజాగా శ్రీనివాస మంగాపురం నుంచి సెకండ్ సింగిల్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. మంగా మంగా అంటూ సాగే ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టు కొంటుంది. తిరుపతిలో జరిగే ప్రేమకథగా శ్రీనివాస మంగాపురం తెరకెక్కుతోంది. కొత్తగా తిరుపతి కొచ్చిన కుర్రోళ్ళని బతకనివ్వరా..? అన్నదమ్ములు లేరా మీకు? అంటూ హీరో.. హీరోయిన్ అందాన్ని చూసి మైమరచిపోయి.. ఆమెపై ఉన్న ప్రేమ భావాలను తెలిపుతున్నట్లు లిరిక్స్ వింటుంటే అర్థమవుతోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సాంగ్ కి కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించాడు. ఇక రేవంత్ తన వాయిస్ తో ఈ సాంగ్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లాడు. జయకృష్ణ క్యూట్ స్టెప్స్, మాస్ లుక్, రషా అందం, విజువల్స్ అదిరిపోయాయి. మే 13 న ఫుల్ సాంగ్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కి సిద్ధమవుతోంది.

Edited,Printed, Published and Owned by DHANDYALA RAVI KUMAR, Printed at Gayathri Printers - ID : PRESS/2025/125/00007278, Address : Plot no: 69 to 75, 4th Line, IDA, Khanapuram, Khammam - 507002.Telangana. EDITOR: DHANDYALA RAVI KUMAR. RNI NO: APTEL/2008/26868. Ph: 9848156178, mail: organ.today@gmail.com , website : www.organnews.in